## నిమ్జ్ నష్టపరిహారం త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

రేజింతల్, మెటల్ కుంట గ్రామాల్లో నిమ్జ్ భూ సేకరణ రైతుల నష్టపరిహారాన్ని త్వరితగతిన అందజేసి పూర్తి చేయాలని జహిరాబాద్ ఆర్డీఓ రాంరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. రేజింతల్, మెటల్ కుంట గ్రామాన్ని శుక్రవారం ఆకస్మిక సందర్శించారు. ఈ సదంర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమ్జ్ భూముల నష్ట పరిహారంలో మిగిలిపోయిన రైతులను త్వరగా గుర్తించి పరిహారం అందజేయాలన్నారు. రెవెన్యూ అధికారులతో కలిసి పలు గ్రామాల్లో టీమ్ వారీగా రైతుల పూర్తి వివరాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భూపాల్, అధికారులు శివకుమార్, పంచాయతీ సెక్రెటరీ అరుణ జ్యోతి, ఏఈఓ సన్నిత్ రెడ్డి, గ్రామస్తులు సిరాజోద్దీన్, జైపాల్ తదితరులున్నారు.


# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

# మెదక్

శనివారం | 08 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com


## చదువే..జీవిత మార్గం..

### రెవరెస్ట్ పౌలైన్ సాగాయి రాణీ

### ఉత్సహంగా సెయింట్ జోసఫ్స్ వార్షికోత్సవ వేడుకలు




నవతెలంగాణ-బెజ్జంకి

విద్యార్థి దశ కీలకమైందని..ప్రత్యేక శ్రద్ధతో కొనసాగించే చదువే..భవిష్యత్తులో జీవితానికి మార్గమని రెవరెస్ట్ పౌలైన్ సాగాయి రాణీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో సెయింట్ జోసఫ్స్ పాఠశాల 29వ వార్షికోత్సవ వేడుకులను సిస్టర్ షాలిని అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వార్సికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా రెవరెస్ట్ పౌలైన్ సాగాయి రాణి హజరై రెవరెస్ట్ పాధర్ ఆరోగ్య ప్రశాంత్, రెవరెస్ట్ పాధర్ తుమ్మల సంతోష్ రెడ్డి, రెవరెస్ట్ మేరి స్టెల్లాతో కలిసి వార్షికోత్సవ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, కరాటే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బోధన సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు హాజరయ్యారు.

# బీసీల లెక్క తేలింది

**మతం పేరుతో విధ్వంసాలు.. ఓట్ల రాజకీయాలు**

**అనుమానాలు ఏమున్నాయా క్లారిటీ ఇస్తా..**

**రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

రాష్ట్రం దేశంలోనే ఒక మార్గదర్శకంగా ఉండే విధంగా కుల సర్వే చేపట్టామని, బీసీలు 56 శాతం ఉన్నట్లు లెక్క తేలిందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో మతం పేరుతో బీజేపీ విధ్వంసాలు సృష్టించి ఓట్ల రాజకీయాలకు వాడుకుంటుందని విమర్శించారు. బీజేపీ బీసీని ముఖ్యమంత్రి చేస్తానని చేసిందా అని ప్రశ్నించారు. కనీసం శాసన సభ పక్ష నాయకుడిని కూడా రెడ్డిని చేసిందన్నారు. రామాలయం నిర్మిస్తే తప్పు లేదని, అందరూ చందాలు ఇచ్చారని, అయినా రామాలయాన్ని ఎన్నికల కొరకు వాడుకుంటారన్నారు. మీకు బలహీన వర్గాల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వస్తె కుల సర్వే చేస్తామని చెప్పి చేయించామన్నారు. లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులు కోటి 12 లక్షల ఇళ్లు తిరిగి సర్వే నిర్వహించారన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మీరు సమాచారం ఇవ్వలేదని, శాసన సభలో చర్చకు పెడితే కుల సర్వేపై సమాచారం ఇచ్చినవారు మాట్లాడితే అర్థం ఉంటుందన్నారు. అనుమానాలు ఏమన్నా ఉంటే అందరికీ క్లారిటీ ఇస్తానన్నారు. మేం సర్వేలకు వ్యతిరేకం కాదంటున్న బీజేపీ నేతలు కేంద్రం దేశ వ్యాప్తంగా సర్వే చేయాలని మీ నాయకులను డిమాండ్ చేయాలన్నారు. శాస్త్రీయంగా, చట్టబద్ధంగా లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులతో సమాచారాన్ని సేకరించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, చిత్తరి పద్మ రవీందర్, అక్కన పేట కాంగ్రెస్ అధ్యక్షుడు జంగంపల్లి ఐలయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

**ఆగి ఉన్న లారిని ఢీకొట్టిన కారు.**

**అక్కడికక్కడే ఇద్దరు దుర్మరణం, మరొకరి గాయాలు.**









నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారి రింగ్ రోడ్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక సీఐ బి సైదా కథనం ప్రకారం.. గోదావరిఖని పట్టణానికి చెందిన లింగం (48), బినేష్ (28) అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ ప్రణయ్ గాయాలతో బయటపడ్డాడు మరో వ్యక్తి మహేష్ తీవ్ర గాయాలు కాగా యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు.ఈ నలుగురు గోదావరిఖని నుంచి హైదరాబాద్ వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారి రింగ్ రోడ్డు వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీకి ఢీకొని ఇంతటి ప్రమాదానికి దారితీసింది. అటుగా వెళ్లిన స్థానికులు తెల్లవారుజామున 108కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది వర్షిత, జ్యోతి, పైలట్స్ మహిపాల్, శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను గంటసేపు శ్రమించి రాడ్ల సహాయంతో డోర్లను పగలగొట్టి బయటికి తీశారు. క్షతగాత్రులను ప్రథమ చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.క్షతగాత్రున్ని ప్రాథమిక చికిత్స అనంతరం యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సిఐ బి సైదా తెలిపారు.

## రాత్రికి రాత్రే హల్దీవాగు నుంచి నీళ్ల చోరీ

**పట్టించుకోని ఇరిగేషన్ శాఖ అధికారులు**



నవతెలంగాణ-తూప్రాన్

రాత్రికి రాత్రే గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి బీటీ రోడ్డు ధ్వంసం చేసి నీటి దోపిడీకి పాల్పడుతున్నారు. ఓ రాజకీయ పార్టీకి చెందిన బడా నాయకుడు నీటి దోపడికి పాల్పడుతున్నా తూప్రాన్ ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ మండలం యావాపూర్, కిష్టాపూర్ ఆనుకుని ఉన్న 80 ఎకరాల మామిడి తోటకు చెందిన ఓ వ్యక్తి అర్ధరాత్రి రోడ్డు ధ్వంసం చేసి భారీగా పైప్ లైన్ వేసి నీటిని అక్కడికి తరలిస్తున్నారని చుట్టూ ప్రక్కల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల కోసం కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి హల్దీవాగులోకి నీటిని విడుదల చేశారు. దీంతో గురువారం రాత్రికి రాత్రే పైప్ లైన్ వేసి నీటి దోపిడికి పాల్పడుతున్నారు. బీఆర్ఎస్‌కి చెందిన ఓ బడా నాయకుని పేరు చెప్పుకుంటూ అటు అధికారులను, ఇటు రైతులను బెదిరింపులకు గురిచేస్తూ ఇష్టానుసారంగా రైతుల పంట పొలాలకు వెళ్లే నీటిని అర్ధరాత్రి దోపిడీ చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు




- కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అంటున్న సర్కార్
- కొత్త కార్డులు...పేర్లు, చిరునామా మార్పులకు అవకాశం
- ఇప్పటికే లక్షల్లో దరఖాస్తు చేసిన పేదలు
- పదేళ్లుగా మంజూరీ ప్రక్రియకు బ్రేకులు
- కొత్త ప్రభుత్వంలోనైనా కార్డులివ్వాలని దరఖాస్తుదారుల డిమాండ్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రేషన్‌కార్డుల మంజూరీ ప్రక్రియకు ప్రభుత్వం మార్గం చూపింది. ఇప్పటి వరకు ప్రజా పాలన, గ్రామ సభల్లో మాత్రమే దరఖాస్తుల్ని స్వీకరించారు. మీ-సేవలో దరఖాస్తుల స్వీకరణ, చేర్పులు మార్పులకు అవకాశం ఉండేది కాదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కొత్త రేషన్‌కార్డు మంజూరీ, పేర్ల నమోదు, పేరు, చిరునామా మార్పులకు అవకాశం కల్పిస్తూ మీ-సేవలో దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. రేషన్‌కార్డుల మంజూరీ అనేది ఒక గడువు పెట్టి చేసేది కాదని, నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని కూడా ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటికే మాన్యువల్, ఆన్‌లైన్‌లో లక్షల మంది దరఖాస్తు చేశారు. కొత్తగా కూడా మీ-సేవలో దరఖాస్తులు చేసేందుకు కార్డుల్లేని పేదలు ఎగబడే అవకాశముంది. ఇకనైనా కార్డుల మంజూరీ, కొత్త పేర్ల నమోదును వేగవంతం చేయాలని పేదలు ఆశిస్తున్నారు.

### మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తులకు ఛాన్స్

రేషన్‌కార్డు లేని వాళ్లు, పాత కార్డులో పేర్లు నమోదు లేని వాళ్లు, పేర్లు, అడ్రస్ వంటి మార్పులకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్త రేషన్‌కార్డుల కోసం మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మీ-సేవా కమిషనర్‌కు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ లేఖ రాసింది. రేషన్‌కార్డుల డేటా బేస్‌ను మీ-సేవకు అనుసంధానం చేయాలని ఎన్‌ఐసీని సివిల్ సప్లయి కమిషనర్ డీఎస్ చౌహాన్ కోరారు. కొత్త రేషన్‌కార్డులతో పాటు కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు అవకాశం కల్పించాలని ప్రజల నుంచి ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 41 లక్షల వరకు కొత్త రేషన్‌కార్డుల్ని మంజూరు చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించింది. అందులో ఆరు గ్యారంటీలకు సంబంధించిన పథకాల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన దరఖాస్తుల్ని ప్రజల నుంచి స్వీకరించింది. అయితే అందులో రేషన్‌కార్డు కోసం లేకపోవడంతో ప్రజల నుంచి డిమాండ్ వచ్చింది. దీంతో ప్రభుత్వం తెల్ల కాగితాల మీద రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుల్ని స్వీకరించింది. ఇటీవల నిర్వహించిన గ్రామ సభల్లోనూ దరఖాస్తులు చేశారు. రెగ్యులర్‌గా నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్లు, తహసీల్దార్లకు దరఖాస్తులు ఇస్తునే ఉన్నారు. వస్తున్న దరఖాస్తుల్లో ఏవి అర్హత కల్గినవి, ఎవరు అనర్హులనేది తేల్చలేకపోతున్నారు. అందుకే మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల్ని స్వీకరించి అర్హుల్ని గుర్తించాలని ప్రభుత్వం బావిస్తుంది. తెల్ల రేషన్‌కార్డు కోసం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపే వార్షికాదాయం ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో మాగాణి మూడున్నర ఎకరాలు, చెలక ఏడున్నర ఎకరాల గరిష్ట పరిమితిని విధించింది.

### ఇప్పటికే లక్షల్లో దరఖాస్తులు

గత పదేళ్లకు పైబడిగా రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డుల జారీ చేయలేదు. రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలో కొత్తగా పుట్టిక పిల్లలు, లేదంటే వచ్చిన కోడళ్ల పేర్లను నమోదు చేసేందుకు కూడా ఏలాంటి అవకాశం ఇవ్వలేదు. దీంతో కొన్నేళ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి లక్షలాది మంది పేదలు రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తు వచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అనేక పర్యాయాలు దరఖాస్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కూడా ప్రజా పాలన కార్యక్రమం, గ్రామ సభల్లోనూ రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేశారు. గత ప్రభుత్వంలో కుటుంబ సభ్యుల నమోదు కోసం మీ-సేవలో దరఖసాస్తు చేశారు. అవన్నీ కూడా పెండింగ్‌లోనే పెట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4 లక్షలకు పైనే దరఖాస్తులు చేశారు. రేషన్‌కార్డు లేకపోవడం, కార్డులో పేర్లు నమోదు కాకపోవడంతో పిల్లల చదువులు, ఇతర అవసరాల విషయంలో ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. కొత్తగా రేషన్‌కార్డు మంజూరు కాకపోవడం వల్ల గత ప్రభుత్వమే కాకుండా ప్రస్తుత ప్రభుత్వంలో మంజూరు చేస్తున్న డబుల్‌బెడ్‌రూం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత గ్యాస్ వంటి ఇతర సంక్షేమ పథకాలను నోచుకోలేకపోయారు.

### మీ-సేవ కేంద్రాల వద్ద రద్దీ

ప్రభుత్వం మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించినందున దరఖాస్తు చేసేందుకు జేనం మీ-సేవా కేంద్రాల చుట్టు తిరగనున్నారు. మీ-సేవలో దరఖాస్తు చేస్తే నిర్ణయించిన పీజు మాత్రమే తీసుకోవాలి. కానీ..! జనం ఎగబడి వస్తున్నారని చెప్పి అదనంగా వసూలు చేయనున్నారు. మీ-సేవా కేంద్రాల్లో రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల గతంలోనే అనేక సందర్భాల్లో అధికంగా డబ్బులు వసూలు చేశారు. రేషన్‌కార్డుల కోసం కూడా పేదలు ఎగబడి దరఖాస్తు చేసుకునేందుకు మీ-సేవా కేంద్రాలను ఆశ్రహించనున్నారు.

## కార్మికుడికి ప్రమాదం జరిగినా పట్టించుకోరా?



నవతెలంగాణ-సంగారెడ్డి

మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్‌గా కాంట్రాక్ట్ కార్మికుడికి ప్రమాదవశాత్తు ఆక్సిడెంట్ జరగడంతో కాలుకు 15 కుట్లు పడ్డాయి. దాంతో నడవలేని స్థితిలోని ఉన్న ఆ కార్మికుడిని సీఐటీయూ బృందం శుక్రవారం పరామర్శించింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ.. విధుల్లో భాగంగా సదరు ట్రాక్టర్ డ్రైవర్ రాత్రిపూట వాహనం నడిపి.. అలాగే ఉదయం కూడా మళ్లీ పిలిచి పనులు చేయించడంతో నిద్ర లేమి కారణంగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఇంత జరిగిన మున్సిపల్ అధికారులు ఇప్పటివరకు కార్మిక కుటుంబాన్ని పరామర్శించకపోవడం చాలా దారుణమన్నారు. కార్మికుడు మంచిగా ఉంటే పని చేయించుకుంటున్నారు తప్పా.. కార్మికుడికి ఏమైనా అయితే తమకు సంబంధం లేదనే రీతిలో మున్సిపల్ అధికారులు వ్యవహరి స్తున్నారన్నారు. కార్మికులకు రక్షణ లేకపోతే వాళ్లు ఎలా పని చేయాలో మున్సిపల్ అధికారులు ప్రభుత్వము సమాధానం చెప్పాలన్నారు. కార్మికు లకు కనీసం ఈఎస్‌ఐ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఉదయం నుంచి పొట్ట చేతుల్లో పట్టుకొని పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకే రక్షణ లేకపోతే వేరే వారికి ఎలా రక్షణ ఇస్తుందో ఈ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. పేరు గొప్ప ఊరు దిబ్బలా ప్రభుత్వం ఉందన్నారు. మంచిచెడు చూసుకోవాల్సిన మున్సిపల్ అధికారులే కార్మికులకు ఇలాంటి సమయంలో అండగా లేకపోవడం ఏంటన్నారు. ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి కార్మిక కుటుంబాలని ఆదుకోవాల న్నారు. లేని పక్షంలో పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సురేందర్, లక్ష్మీనారాయణ యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓవరాక్షన్ చేయొద్దు

- అనవసరంగా ఇబ్బందులు పడతారు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- హైకోర్టు న్యాయవాదిపై ఫైర్..



నవతెలంగాణ-అమీన్‌పూర్

'ఓవరాక్షన్ చేయొద్దు.. అనవసరంగా ఇబ్బందులు పడతారు' అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ హైకోర్టు లాయర్ ముఖీంపై మండిపడ్డారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ ఐలాపూర్‌లో, రాజగోపాల్‌నగర్ అసోసియేషన్ బాధితుల ప్లాట్ల సమస్యలను వినేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం వచ్చారు. మున్సిపాల్టీలోని ఐలాపూర్ రాజగోపాల్‌నగర్, చక్రపురి కాలనీ అసోసియేషన్ సభ్యులతో రంగనాథ్ సమావేశమయ్యారు. ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితుల ఫిర్యాదు మేరకు ప్లాట్ల వద్దకు వచ్చి బాధితులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి ప్లాట్ల ఫిజికల్ పొజిషన్ పరిశీలించి.. వారి సమస్యను కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపుతానని బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో ఐలాపూర్ గ్రామవాసి, హైకోర్టు న్యాయవాది ముఖీం, హైడ్రా కమిషనర్ రంగనాథ్ మధ్య సీరియస్ డిస్కషన్ జరిగింది. బాధితుల సమస్యలు వింటున్న సమయంలో హైకోర్టు న్యాయవాది ముఖీం జోక్యం చేసుకుని.. కోర్టు పరిధిలో ఉన్న దాన్ని చూసేందుకు ఎందుకు వచ్చారని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ప్లాట్లకు సంబంధించిన పలు ఆధారాలు కమిషనర్ రంగనాథ్‌కు చూపిస్తూ 'మీరు తెలుగు చదువుతరు కదా' అని ముఖీం అడిగారు. దానికి స్పందించిన రంగనాథ్ 'నేను తెలుగు చదువుతా.. అన్ని చదువుతా కానీ.. మీరు చెప్పేది చెప్పండి. ఎక్కువ మాట్లాడకుండా చెప్పాల్సింది చెప్పండి. ఓవర్ యాక్షన్ చేయకండి. మీరు ఓవరాక్షన్ చేశారనుకోండి అనవసరంగా ఇబ్బందులు పడతారు' అంటూ సీరియస్ అయ్యారు. అనంతరం మీడియాతో రంగనాథ్ మాట్లాడుతూ.. రెండు వారాల్లో లోతుగా పరిశీలించి ఇరు వర్గాల వారి చెప్పినది వింటామని చెప్పారు. అలాగే కోర్టు పరిధిలో ఉన్న అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని రెండు నెలల్లో పరిష్కారం చూపుతామన్నారు. ఇక్కడ కొంతమంది భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నట్లుగా అర్థమవుతుందన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉన్నచోటికి గ్రామస్తులతో కలిసి వచ్చిన న్యాయవాది ముఖీంతో వాగ్వాదం చోటు చేసుకోవడంతో పోలీసులు అక్కడి నుంచి పంపించేశారు.

### ప్లాట్లు ఇప్పిస్తామని ఎలా చెబుతారు..?

**- హైకోర్టు న్యాయవాది ముఖీం**

న్యాయవాది ముఖీం ఐలాపూర్‌లోని తన గెస్ట్ హౌజ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాజగోపాల్ నగర్ ప్లాట్ ఫ్రాడ్ లేఔట్, 1972లో లేఔట్ అయితే 1986లో ప్లాటు ఎలా వస్తాయని ప్రశ్నించారు. కోర్టు కొట్టేసి, సక్సెషన్ కాని ముస్లింల వద్ద కొనుగోలు చేసిన ప్లాట్లు ఎట్టి పరిస్థితుల్లో వారికి చెందవన్నారు. రెండు నెలల్లో రాజగోపాల్ నగర్‌లోని ప్లాట్లను ఇప్పిస్తామని రంగనాథ్ ఎలా చెప్తాడన్నారు. సర్వే నంబర్లు 176, 177 శిఖం భూమిలో టెంట్ వేయమని చెప్పి సమావేశమైన రంగనాథ్ హైకోర్టు ఆర్డర్‌ను దిక్కరించా రన్నారు. హైకోర్టులో కేసు ఉందని చెప్పినా కమిషనర్ వినకుండా తనపని తాను చేసుకుంటున్నాడన్నారు. హైడ్రా పోలీసు స్టేషన్ ను కూడా తాము అడ్డుకుంటామని, హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం ఏ యాక్టులో లేదన్నారు. పోలీసులను పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు. హైకోర్టు కేసులో రంగనాథ్ పై కంటెప్ట్ వేస్తున్నామన్నారు.

## గురుకులంలో కలెక్టర్ రాత్రి బస



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకులంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం రాత్రి బస చేశారు. అంతకుముందు విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలుతెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలు, వంటగది, స్టోర్ రూమ్, భోజనం తయారీ చేసే విధానాన్ని పర్యవేక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేసిన కలెక్టర్.. వారికి తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని త్వరలో పరీక్షలు ఉన్నందున విద్యార్థులలో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు పని చేస్తున్నామని తెలిపారు. విద్యలో అత్యంత వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఇటు ఉపాధ్యాయులకు విద్యా బోధనపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తహశీల్దార్, శ్రీనివాస్, ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ సంబంధిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ నిర్మాణం ఆపాలి

**సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**

**కలెక్టరేట్ ఏవోకి వినతిపత్రం అందజేత**

నవతెలంగాణ-సంగారెడ్డి

గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లో జిహెచ్ఎంసి డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏవో పరమేశ్వర్‌కి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం జయరాజు మాట్లా డుతూ.. గుమ్మడిదల మండలం ప్యారానగర్ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 40,41లో 151 ఎకరాల భూమిలో జిహెచ్ఎంసి డంపింగ్ యార్డ్ కోసం ప్రభుత్వం బలవంతంగా రైతుల నుండి భూవ ులు గుంజుకోవడం దారుణమన్నారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్ల పరిధిలో నుంచి ప్రతిరోజూ సుమారు 1900 టన్నుల చెత్తను ప్యారా నగర్ డంప్యార్డ్‌కు తరలించాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అధికారులు పోలీసులను పెట్టి భయానక వాతావరణం సృష్టిస్తు న్నారన్నారు. రైతులు, వరి, కూరగాయలు తదితర పచ్చని పంటలను పండించుకుని జీవనం గడుపుతున్నార న్నారు. పచ్చటి పంట పొలాలు నాశనం చేసి డంపు యార్డ్ నిర్మాణం నిర్మాణం చేపట్టడం సరికాదన్నారు. ప్యారానగర్‌ను మరో జవహర్ నగర్గా చేసే కుట్ర జరుగుతున్నదన్నారు. జిహెచ్ ఎంసి డంపు యార్డు నిర్మాణం వెంటనే నిలిపివే యాలని డిమాండ్ చేశారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రైతులపై పెట్టిన కేసుల ను ఎత్తివేయాలన్నారు. ప్రజలు చేస్తున్న పోరాటానికి సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు తెలియజేస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.రాజయ్య, మాణిక్యం, జి.సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చర్యలు



నవతెలంగాణ-న్యాల్ కల్

గ్రామ పంచాయతీల్లో ఎండాకాలం రానున్న నేపథ్యంలో ప్రజలకు మంచినీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటు న్నట్టు జహీరాబాద్ మిషన్ భగీరథ ఆర్డబ్ల్యూఎస్ డీఈ సాబేర్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని రేజింతల్, మిర్జాపూర్(బి), గంగ్వార్, న్యామతాబాద్‌తో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం సమ్మర్ యాక్షన్ ప్లాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా మిషన్ భగీరథ మంచినీటి సరఫరా ఇబ్బందులను గుర్తించి వాటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నామన్నారు. నీటి సమస్య వస్తే ప్రజలు వెంటనే పంచాయతీ సెక్రెటరీ, మిషన్ భగీరథ వాటర్ లైన్మెన్ సంప్రదించాల న్నారు. 10 తేదీ వరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ కొనసాగుతుందన్నారు. అందరు సమన్వయంతో పనిచేసి నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అనంతరం వీధుల్లో తిరుగుతూ మిషన్ భగీరథ పైప్లైన్ నల్లాల పరిస్థితి పరిశీలించారు. మిషన్ భగీరథ నీరు వస్తుందా లేదా అడిగి తెలుసుకున్నారు. కొత్త కాలనీలో మంచినీటి సరఫరా వచ్చేలా చూస్తామన్నారు. పైప్లైన్ లీకేజీలు ఉంటే మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ అధికారులు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ ఏఈఈ అనిల్ కుమార్, పంచాయతి సెక్రెటరీలు అరుణ జ్యోతి, రాంప్రసాద్, వివేక్, గ్రామస్తులు సిరాజోద్దీన్ తదితరులున్నారు.

## డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు నిలిపివేయాలి



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్యారానగర్ గ్రామంలో జిహెచ్ఎంసి డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని సీపీఐ(ఎం) పటాన్చెరు ఏరియా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్యారానగర్ గ్రామంలో సీపీఐ(ఎం) బృందం శుక్రవారం పర్యటించి ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించింది. ఈ సంద ర్భంగా పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి బి.నాగేశ్వర రావు మాట్లాడుతూ..డంపింగ్ యార్డు కోసం సర్వే నెంబర్లు లేని భూముల్లో దాదాపు 105 ఎకరాలు కేటాయిం చినట్టు రెవెన్యూ అధికారులు చెబుతున్నారన్నారు. పంట పొలాలకు పనికివచ్చే అలాంటి భూములను డంపింగ్ యార్డ్ కోసం ఇవ్వడం అన్యాయమన్నారు. 2015లో అప్పటి ప్రభుత్వం కేటాయించి నట్లుగా తెలుస్తున్నదన్నారు. జిహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి చెత్తను సేకరించి ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ కోసం కేటాయించిన భూముల్లో వేయడం మూలంగా కొత్తపల్లి, నల్లవల్లి, మంబాపూర్, గుమ్మడిదల ఇతర ప్రాంతాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతారన్నారు. చుట్టుపక్క ప్రాంతాల్లో ఉన్న చెరువులు పూర్తిగా కలుషితం అవతాయన్నారు. కాబట్టి వెంటనే ఈ డంపింగ్ యార్డ్ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అన్ని గ్రామాల ప్రజలను ఏకం చేసి ఐక్య పోరాటం ద్వారా సమస్యను పరిష్కరించుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్, విష్ణు, యాదగిరి పాల్గొన్నారు.

## ఘనంగా గీతం ప్రమాణ-2025 ప్రారంభం

**మూడ్రోజుల పాటు కొనసాగనున్న విద్యార్థుల వేడుక అలరించనున్న ప్రముఖులు**





నవతెలంగాణ-పటాన్‌చెరు

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న వార్షిక ఉత్సవం. ప్రమాణ-2025 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. సాంకేతిక, సాంస్కృతిక, సంక్షేమ కార్యక్రమాల మేలు కలయిక అయిన ఈ వేడుక ప్రారంభోత్సవంలో సంగారెడ్డి జిల్లా ఎస్పీ సీహెచ్ రూపేష్ ముఖ్య అతిథిగా, సీవైఎస్‌వైసీఎస్ గ్రూపు ముఖ్య కార్యనిర్వహణాధికారి, వ్యవస్థాపకుడు శ్రహంజ్ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. విశేషమైన విజయాల కోసం కృషి చేయాలని, అత్యుత్తమ ప్రదర్శనకు తమను తాము సన్నద్ధం చేసుకోవాలంటూ విద్యార్థులను ఎస్పీ ప్రేరేపించారు. హద్దులను అధిగమించి ఆయా వ్యక్తుల అభిరుచులు, ఆసక్తులకు అనుగుణంగా జీవితంలో రాణించాలని శ్రహంజ్ సూచించారు.గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్. శాస్త్రి, ప్రమాణ - 2025 అధ్యాపక సలహాదారు డాక్టర్ పి.త్రినాథ రావు, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ప్రతినిధులు, పలువురు అధ్యాపకులు, తదితరులు ఈ ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొన్నారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో ఆయా కార్యక్రమాలలో పాల్గొని, ఈ మూడు రోజుల వేడుకను విజయవంతం చేయాలని వారు కోరారు. ప్రమాణ-2025 తొలి రోజు గీతం నమూనా ఐక్యరాజ్య సమితి (జీఎంయూఎన్), వయ్యారంగా చీర ధరించే కార్యశాల, క్లాసికల్ -ఫ్యూజన్ డ్యాన్స్ పోటీలు, రంగోలి పోటీ, లైవ్ పెయింటింగ్-స్కెచింగ్, డిబేట్ పోటీలు, ఓపెన్ మైక్‌లతో పాటు పలు వర్క్ షాపులు, రిక్రియేషనల్ థెరపీ, మెంటల్ హెల్త్ బింగో వంటి ఉత్తేజకరమైన సంక్షేమ కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ప్రఖ్యాత కళాకారులు నికితా గాంధీ, మంగ్లీ తమ పాటలతో యువ తను ఉర్రూతలూగించారు. ప్రమాణ-2025 విద్యార్థులు తమ సృజనాత్మకత, ఆవిష్కరణ, సమగ్రతను ప్రదర్శించడానికి ఒక శక్తివంతమైన వేదికగా ఉంటుందని హామీ ఇవ్వడమే గాక, అవధులు లేని ప్రతిభా స్ఫూర్తిని చాటిచెబుతోంది.

నవతెలంగాణ
సంగారెడ్డి
శనివారం | 08 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

## వివాహ వేడుకలకు హాజరైన ప్రముఖులు

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలో రేజింతల్ సిద్ధివి నాయక ఆలయంలో మురహరి రెడ్డి కుమారుడి వివాహ వేడుక శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక రావు, మల్కా పురం శివకుమార్, నరోత్తం, జైపాల్‌రెడ్డి, పలు పార్టీల ప్రము ఖులు హాజరై నూతన వధూవంపలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువ నాయకుడు సాయి అరుణ్ రెడ్డిని అభినందించి.. అనంతరం విందును స్వీకరించారు. ఈ వేడుకల్లో పలు పార్టీల మండల నాయకులు, మాజీ జెడ్పీటీసీ చంద్రప్ప, ముంగి నరసింహారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, శశికాంత్ కిరణ్ రెడ్డి ,సాయి అరుణ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రేజింతల్ శేఖర్, బీరప్ప, మానేన్న, సంజుయు తదితరులున్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇండ్లు దగ్ధం

నవతెలంగాణ-రాయికోడ్



షార్ట్ సర్క్యూట్ వల్ల రెండు ఇండ్లు దగ్ధమైన ఘటన మండల పరిధిలోని రాయిపల్లి గ్రామంలో జరిగింది. స్థానిక ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రాయపల్లి గ్రామానికి చెందిన బురుజుకాడి మహిమద్ ఇంట్లో శుక్రవారం ఎలక్ట్రిక్ వైర్ల షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు దగ్ధమైంది. దాంతో ఇంట్లోని బంగారు నగలు, నగదు, వస్తువులు కలిపి మొత్తం కాలిపోయాయి. దాంతో నాలుగు లక్షల యాభై వేల నష్టం జరిగిందన్నారు. మంటలు ఎగిసిపడడంతో ఆ ఇంటి పక్కనే ఉన్న బురుజు కాడి ప్యారాబి ఇంటిపైకి మంటలు చెలరేగి దగ్ధమయ్యింది. దాంతో ఆ ఇంట్లో సుమారు లక్ష రూపాయల నష్టం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసామని ఎస్ఐ చెప్పారు.

## నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కొండాపూర్



బీఆర్ఎస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్ నూతన గృహప్రవేశ వేడుకలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విఠల్, కాసాల బుచ్చిరెడ్డి, డా. శ్రీహరి,పాండు,మోహన్ గౌడ్, రుక్మోదిన్,గోవర్ధన్ రెడ్డి, నర్సింలు,రమాగౌడ్, శామ్ రావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-రాయికోడ్

మండల పరిధిలోని రాయపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ అడివయ్యా నూతన గృహప్రవేశ వేడుకకు ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విట్టల్,మాజీ ఆలయ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, నాయకులు బసవ రాజ్, అంజి, మాజీ ఎంపిటిసి విష్ణువర్ధన్, మాజీ సర్పంచులు మహిపాల్ రెడ్డి, నాయకులు జైపాల్ రెడ్డి ,,నరేష్, నాగేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## చింతల్‌గట్టులో డ్రైనేజీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-కోహిర్



మండలంలోని చింతల్‌గట్టు గ్రామంలో సుమారు రూ.5 లక్షల తన సొంత డబ్బులతో 200 మీటర్ డ్రయినేజీ, రెండు కల్వర్ట్‌లను పారిశ్రామికవేత్త జహీరాబాద్ అసెంబ్లీ నాయకులు కె.ప్రసాద్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లన్న పాటిల్, కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండలాధ్యక్షులు పి.రామలింగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ జి.రాందాస్, వినోద్, కాంగ్రెస్ నాయకులు కవేలి కృష్ణ,సుధీర్, మొయిజ్, రాంరెడ్డి, మైసయ్య, ఊరడి నర్సిములు, అబ్రహం, రాజు, రాథోడ్ సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడి కేంద్రం భవనం ప్రారంభం



నవతెలంగాణ-కోహిర్

మండల కేంద్రంలోని చింతల్‌గట్టు గ్రామంలో అంగన్వాడి కేంద్ర భవనాన్ని సీపీడీఓ అంజమ్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ గ్రేసీ, విజయలక్ష్మి, అనిత, అంగన్వాడి టీచర్ అక్కమాదేవి, జయశిల తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఉపకేంద్రం పనులు పరిశీలించిన డీఈ

నవతెలంగాణ-న్యాల్‌కల్



రేజింతల్‌లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పనులు చురుగ్గా మొదలయ్యాయి. కాగా ఆరోగ్యకేంద్రం పనులు ఏ దశలో ఉన్నాయో.. ఎలా జరుగుతు ందో పంచాయతీరాజ్ డీఈ మల్లేశం శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శఫీయోద్దీన్ తదితరులు ఉన్నారు.



## అంధకారంలో చర్ల గోపులారం

నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని చర్లగోపులారం గ్రామంలో వీధిలైట్లు లేక రెండు నెలల నుంచి రాత్రుల్లో రోడ్లన్నీ అంధకారంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్ లైట్లు లేకపోవడంతో రాత్రుళ్ల ప్రజలు నానా అవస్థలు పడు తున్నారు. గ్రామ సమస్యలు చెబుదామని కార్యదర్శికి ఫోన్ చేసిన ఫోన్ ఎత్తడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో సమగ్ర కులగణన సర్వేలో కూడా సరిగా పాల్గొనకుండా పంచాయితీ సిబ్బందితో కులగణన సర్వే చేయించడం వల్ల అర్హులకు సంక్షేమ పథకాల జాబితాలో రాలేదని ఆరోపించారు. కాబట్టి విధులకు గైర్హాజరు అవుతున్న గ్రామ కార్యదర్శి పై ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## రోడ్డు భద్రతపై కళాకారుల ప్రదర్శన

నవతెలంగాణ-చౌటకూర్



మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై కళాకారులు శుక్రవారం ప్రదర్శన చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రోడ్డు భద్రత అదేవిధంగా ఓటరు అవగాహన, పచ్చదనం పరిశుభ్రత మొదలైన కార్యక్రమాల పై కళాకారులు రవీందర్,మదన్ సింగ్,రాజు, సాయిలు,ఆగమయ్య, స్వప్న,శశిప్రియ పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## స్తంభాన్ని ఢీకొన్న హైవే ప్యాట్రోలింగ్ వాహనం



నవతెలంగాణ-చౌటకూర్

మండల పరిధిలోని తాడ్దాన్‌పల్లి టోల్ ప్లాజాలో ఉన్న హైవే ప్యాట్రోలింగ్ వాహనం గురువారం అర్ధరాత్రి తాడ్దాన్‌పల్లి నుంచి టోల్ ప్లాజా వైపునకు వెళుతుండగా గ్రామ శివారులోని మంజీరా టౌన్ షిప్ వద్దగల మూలమలుపు దగ్గర రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ కడ్డీలను ఢీకొట్టింది. దాంతో వాహనంలో ఉన్న ఇద్దరు యువకులు, డ్రైవర్ మున్నాకు స్వల్ప గాయాలు కాగా పక్కన కూర్చున్న వ్యక్తి కాలు విరిగింది. వారిని హైవే అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్యం సేవించి వాహనం నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-జోగిపేట

ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జోగిపేట కోర్టు న్యాయవాది హరి నారాయణ వర్మ, అల్లే శ్రీకాంత్‌లు సూచించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, అక్సన్‌పల్లి గ్రామాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు ఏమైనా ఉంటే సామరసంగా పరిష్కరించుకోవాలని సూచించారు. క్షణికావేశంలో గొడవలకు దిగి విలువైన జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అక్సన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగా హన కార్యక్రమాన్ని చేపట్టారు.కార్యక్రమంలో హెచ్ఎం ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## యువ ఖేల్ క్రీడల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 10, 11న జరిగే జిల్లా స్థాయి యువ ఖేల్ క్రీడల పోస్టర్‌ను శుజిల్లా యువజన క్రీడా శాఖాధికారి ఖాసిం బేగ్ శుక్రవారం ఆవిష్కరించారు. నెహ్రూ యువకేంద్ర- మై భారత్ సంగారెడ్డి.. సంగారెడ్డి జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, సర్దార్ పటేల్‌యువజన సంఘం సంయుక్తంగా క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ, వాలీబాల్, షెటిల్ బ్యాడ్మింటన్, క్రీడాపోటీలు (పురుషుల మ మహిళా) యూత్ కేటగిరీ అండర్ 14-29 మాత్ర మే.. సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో షెటిల్ బ్యాడ్మింటన్ కలెక్టరేట్ ఇండోర్ స్టేడియం లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాల్గొనే క్రీడా జట్లు 9985351111 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## 'డబుల్' ఇండ్ల కాలనీల్లో వసతులు కల్పించాలి

**జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

నవతెలంగాణ-రామచంద్రాపురం



నూతన పట్టణాన్ని తలపించేలా డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాన్ని శుక్రవారం సందర్శించారు. వివిధ శాఖల అధికా రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద అన్ని సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. ఇక్కడ 7258 కుటుంబాలకు చెందిన 30 వేల జనాభా నివసిస్తున్నారని వారికి అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇంకో 30 వేల మంది జనాభా కాలనీకి వచ్చే అవకాశం ఉందన్నారు. కాలనీలో పట్టణాన్ని తలపించేలా అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మరింత ఎక్కువ మంది ప్రజలు స్థిరపడే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో గ్రామంలో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రస్తుత అవసరాలకు సరిపోవని ఈ నేపథ్యంలో గ్రామానికి మానవీయమైన మరియు సాంకేతిక మౌలిక సదుపాయాల కల్పన అవసరం ఉందన్నారు. ఇక్కడి పిల్లలకు ప్రాథమిక విద్య అనేది చాలా కీలకమైనదని, దీని కోసం ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు సరిపడా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఉన్నత పాఠశాల కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. కాలనీ ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాల కల్పన కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని.. జనాభా సంఖ్య కనుగుణంగా ఆశా కార్యకర్తలను, ఏఎన్ఎం లను సబ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. కాలనీలో తాగునీటి వసతి మురుగు నీటి వ్యవస్థ ఏర్పాటు కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. కాలనీలోని వివిధ టవర్లలో లిఫ్ట్ వ్యవస్థలు మరమ్మత్తులను చేపట్టాలన్నారు. రోడ్లపై మురుగు నీరు ప్రవహించకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుపై ఇంజనీర్లు దృష్టి సారించాల్సి న అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు అవసరమైన ప్రతిపాదనలు పంపిస్తే వెంటనే నిధులు మంజూరు చేసేలా చూస్తారన్నారు. కాలనీలోని ప్రజలు వివిధ ప్రాంతాల నుండి ఎక్కువగా రాకపోకలు సాగించే విధంగా అవసరమైన రూట్లో బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని రవాణశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. మెరుగైన టెలికమ్యూనికేషన్స్ సేవలు అందిం చేలా ప్రభుత్వ ప్రైవేటు రంగాల ద్వారా సెల్ టవర్లు ఏర్పా టు చేయడంతో పాటు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేలా బీఎస్ఎన్ఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కుటుంబాల సంఖ్య.. జనాభా సంఖ్య ఆధారంగా ఎన్ని రేషన్ దుకాణాలు అవసరమో చూడాలన్నారు. కాలనీ వాసులకు రక్షణ కల్పించడం కోసం పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం అవసరమైన అభివృద్ధి పనుల నిర్మాణం కోసం త్వరిత గతిన నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి, సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి, జిహె చ్ఎంసీ అధికారులు, సంబంధిత అధికా రులు, కాలనీవాసులు,ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డ్‌పై నాల్గొ రోజు నిరసనలు

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రతిపాదనపై గ్రామస్తుల నిరసనలు నాల్గొ రోజు కొనసాగుతున్నాయి. శుక్రవారం ప్రధాన రహదారిపై మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు బైఠాయించి నిరసన తెలిపారు. పర్యావరణాన్ని కాపాడండి, భూములను కలుషితం చేయొద్దు అంటూ నినాదాలు చేశారు. డంపింగ్ యార్డ్ వల్ల భూగర్భ జలాలు, పంట భూములు కలుషితమవు తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే ఆందోళనను ఇంకా ఉధృతం చేస్తామని.. డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కాగా నిరసనలు ఉధృతం కాకుండా పోలీసులు భారీగా మోహరించారు.

## భూ సమస్య పరిష్కారానికే గ్రామసభ

- ట్రైయినీ కలెక్టర్ మనోజ్
- సర్వే నిర్వహించినా తమ పేర్లు జాబితాలో లేవంటూ రైతుల ఆందోళన

నవతెలంగాణ-ఝరాసంగం



గత కొంతకాలంగా బీడకన్నె గ్రామంలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ఎంజాయ్ మెంట్ సర్వేను చేపట్టి గ్రామ సభను నిర్వహిస్తున్నట్టు ట్రైయినీ కలెక్టర్ మనోజ్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో బీడకన్నె గ్రామంలో ప్రభుత్వ భూముల సర్వే నెంబర్లైన 42,56, 89, 101, 106లలో సర్వేయర్లు నిర్వహించిన ఎంజాయ్మెంట్ సర్వే జాబితాను రైతులముందు శుక్రవారం వెల్లడించారు. వ్యవసాయ యోగ్యమైన భూమిలో ప్రస్తుతం కబ్జాకు, కాస్తులో ఉన్న రైతుల భూమి యొక్క విస్తీర్ణంను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో భూ సమస్యలు లేకుండా కృషి చేస్తామని తెలిపారు. కాస్తుకు, కబ్జాలో లేకుండా పాస్ పుస్తకాలు తీసుకున్న వారు, కబ్జాకు ఒక ఎకరాల్లో ఉంటూ.. రికార్డుకు నాలుగు ఎకరాలకు ఉన్న అలాంటి వారిని తొలగించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కానీ పై అంశాల వారిగా ఎంతమంది రైతులు ఉన్నారనేది రైతుల ముందు వెల్లడించలేదు. రికార్డుల్లో మార్పులు, చేర్పులు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులకు సంబంధించి సర్వే నెంబర్ల ఆధారంగా ఫిర్యాదులను స్వీకరించారు.సర్వేనెం.101, 89లలో ఎంజాయ్మెంట్ జాబితాలో తమ పేరు రాలేదని రైతు మొల్ల కాజామియా, మిగతా రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సర్వేకి సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు ఉన్న 24 గంటలలో తెలపాలని స్థానిక తహసీల్దార్ తిరుమలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యాసీన్, ఆర్ఐ రామారావు, సర్వేయర్ నరసింహులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం, మంత్రుల ఆదేశాలు బేఖాతర్

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తెల్లాపూర్ వాసులు

నవతెలంగాణ-రామచంద్రాపురం



తెల్లాపూర్ మున్సిపాల్టీలోని నారాయణరావు వెంచర్‌లో చోటు చేసుకుంటున్న కబ్జాలపై విచారణ జరపాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సిఫార్సును సైతం అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారని స్థానికులు కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. శుక్రవారం కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమస్యలపై లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వే నెంబర్ 324లోని నారాయణ రావు లే అవుట్ లోని ఏ బ్లాక్‌లో ప్రభుత్వ భూమి కబ్జాల పై స్థానికులు కలెక్టరుకు పిర్యాదు చేశారు. కబ్జాలపై మున్సిపల్, రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడంతో, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్టుగా కలెక్టర్‌కు వివరించారు. ఫిర్యాదు పై విచారణకు ఆదేశించినా.. మంత్రి ఆదేశాలను సైతం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తెల్లాపూర్ మున్సిపల్ అధికారులు సమాచార హక్కు చట్టం దరఖాస్తులను సైతం లెక్క చేయకపోవడం వంటి అంశాలను కలెక్టర్‌కు వివరించారు. గతంలో ముప్ప కన్‌స్ట్రక్షన్ కంపెనీ నాలాను ఆక్రమించి నిర్మించిన నిర్మాణలపై సాక్షాత్తు సీఎం ఆఫీస్ కి ఫిర్యాదు చేస్తే సీఎం ఆఫీస్ నుంచి వచ్చిన లేఖలను సైతం మున్సిపల్ అధికారులు బేఖాతరు చేశారని కలెక్టర్ ముందు వాపోయారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఫిర్యాదు కాపీలను తనకు పంపించాలని వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

## జహీరాబాద్ డిపోకు కొత్త బస్సులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ డిపోకు నూతన బస్సులు మంజూరు చేయడంతో పాటు నూతన బస్టాండ్ నిర్మాణాన్ని చేపట్టాలని జహీరాబాద్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్తలు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త డా. జాన్ నిసార్ మొయిన్ నేతృత్వంలో ఆర్టిఓ రాంరెడ్డికి, డిపో మేనేజర్‌కు శుక్రవారం మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జహీరాబాద్ ఒక చారిత్రక, అభివృద్ధి చెందుతున్న నగరంగా ఉన్నప్పటికీ, తీవ్ర రవాణా సమస్యలను ఎదుర్కొంటోందన్నారు. ప్రజా రవాణా సౌకర్యాల లోపం, 50 ఏండ్ల క్రితం నిర్మించిన బస్ డిపో అస్తవ్యస్తంగా మారడంతో ప్రయాణికులకు, ముఖ్యంగా మహిళలు, దివ్యాంగులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ప్రయాణికులు కూర్చోవడానికి తగిన సీట్లు లేకపోవడంతో గంటల తరబడి నిలబడి ఉండాల్సిన పరిస్థితి ఉన్నదన్నారు.తగిన ప్లాట్‌ఫారమ్‌లు లేకపోవడం వల్ల బస్సులు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే తాగునీరు, కాంటీన్ కొరత వెంటాడుతున్నదన్నారు. కాబట్టి వెంటనే స్పందించి.. ఈ సమస్యలను పరిష్కరించలని కోరారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఘౌస్‌ద్దీన్ బాబాపటేల్, మహమ్మద్ అయూబ్, అయూబ్ ఖాన్, మహమ్మద్ మహ్మూద్, జమీల్ అహ్మద్, మహమ్మద్ అరిఫ్, మహమ్మద్ హుస్సేన్, మహమ్మద్ ముజ్ఞ్ లష్కరీ తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల కోసం పిల్లల్ని పోగొట్టుకొన్న మాతృమూర్తి రమాబాయి



నవతెలంగాణ-సంగారెడ్డి

అణగారిన వర్గాల భవిష్యత్ కోసం తన కన్న పిల్లల్ని పోగొట్టుకొన్న మాతృమూర్తి రమాబాయి అంబేద్కర్ అని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ కొనియాడారు. రమాబాయి 127వ జయంతి సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ అధ్యక్షతన సంగారెడ్డి సుందరయ్య భవన్‌లో రమాబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద ర్భం గా మానిక్ మాట్లాడుతూ.. దేశంలోని అణగారిన వర్గాల కోసం రమాబాయి తన జీవితాన్నే గాక తన పిల్లల జీవితాల్ని కూడా కోల్పోవాల్సి వచ్చిందన్నారు. తన కళ్ళ ముం దరే కన్న బిడ్డలు చనిపో తున్నా.. ఆకాశమంత దు:ఖాన్ని దిగమింగిందన్నారు. అంబేద్కర్‌కి జీవిత భాగస్వామిగా, త్యాగశీలిగా నిలిచిందన్నారు. రమాబాయి స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. మనువాద విధానాలను తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని.. రాజ్యాంగం కాపాడాల న్నారు. ఈ కార్యక్రమం సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాలరాజ్, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దాస్ జిల్లా కమిటీ సభ్యులు దత్తు, ప్రభు, శ్రీనివాస్, శ్రీకాంత్, రజక సంఘం నాయకులు హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా అంబేద్కర్ సంఘం కార్యాలయంలో రమాబాయి అంబేద్కర్ 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు కొండాపురం జగన్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పంబల్ల దుర్గాప్రసాద్, గౌరవ అధ్యక్షులు బైండ్ల అశోక్ కుమార్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి. రామారావులు మాట్లాడుతూ.. ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర ్యలు పవన్ పోతు రాజు, జెల్ల సురేష్,పురుషోత్తం, కుమార్, రమేష్, సాగర్, ఉదయ్, ప్రమోద్,అశోక్, శ్రీకాంత్, సునీల్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## 17వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా

- ఐదేండ్లలో ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కింది
- 17వ వార్డు మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు
- కోటి రూపాయలతో తూర్పు గౌని ముదిరాజ్ సంఘం నూతన భవన నిర్మాణం

నవతెలంగాణ-జోగిపేట



అందోల్-జోగిపేట మున్సిపల్ వార్డుల్లో 17వ వార్డులో అన్ని రంగాలలో అభివృద్ధి చేశానని ఆ వార్డు మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు అన్నారు. తూర్పు గౌని ముదిరాజ్ సంఘం ఆవరణలో అపూర్వ సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేండ్లు వార్డు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే భాగ్యం కలిగిందన్నారు. వార్డులో గతంలో చాలా వరకు నీటి సమస్య ఉండేదని, తాను మున్సిపల్ కార్యాలయం నుంచి కాకుండా సొంతంగా డబ్బులు వెచ్చించి 5 నుంచి 6 బోర్లు వేయించి నీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఏమైనా పెండింగ్ పనులు ఉన్నా త్వరలోనే పూర్తి చేస్తానని వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో వార్డులో సీసీ రోడ్లు, అందరూ గ్రౌండ్ డ్రైనేజ్ ఇతర పనులు చేపట్టడం జరిగిందన్నారు. రూ.1 కోటి నిధులను తెప్పించి తూర్పు గౌని ముదిరాజ్ సంఘాన్ని నూతనంగా నిర్మించుకొని పేద ప్రజలకు శుభ కార్యాలకు అనుగుణంగా తయారు చేసుకుందామని సూచించారు. త్వరలోనే వార్డులోని కందకాన్ని పూడ్చి ఆ సమస్య కూడా పరిష్కరిస్తానని తెలిపారు. వార్డు ప్రజలకు ఎల్ల ప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి సేవ చేసుకుంటానని హామీ ఇచ్చారు. మంత్రి దామోదర్ కృషితో వార్డులో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఇల్లు కట్టుకుంటే రూపాయలు ఐదు లక్షలు వచ్చేలా చర్యలు తీసుకుంటా అన్నారు. అనంతరం ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## రోడ్డుపైనే పార్కింగ్..

- ఇబ్బంది పడిన వాహనదారులు, ప్రజలు
- రెండు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు



నవతెలంగాణ-పట్‌పల్లి



మండల కేంద్రమైన వట్‌పల్లిలో శుక్రవారం జరిగిన వారాంతపు సంతలో వాహనాలు రోడ్డు పక్కనే నిలపడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. సు మారు 2 కిలో మీటర్ల మేర వాహనాలు నిలపడంతో అరగంట పాటు వాహనా లునిలిచిపోయాయి. విషయం తెల్సుకున్న ట్రాఫిక్ పోలీ సులు.. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

కాగా ప్రతీ శుక్రవారం వారంతపు సంతకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వస్తుంటారు. అదే సమయంలో పశువులు, మేకల సంత ముగించుకొని అదే రోడ్డున వెళ్తుంటారు. ఈ క్రమంలో సంతకు వచ్చిన వారు రోడ్డుపైనే వాహనాలు నిలపడం, రోడ్డుపైనే చిరు వ్యాపారుల వారు దుకాణాలు పెట్టడంతో ఆ రోడ్డుగుండా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జోగిపేట నుంచి వట్‌పల్లి, అల్లాదుర్గం నుంచి జహీరాబాద్‌కు వెళ్లే వాహనాలు ఈ దారిగుండానే వెళ్లాల్సి ఉండడంతో.. ఆ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ శుక్రవారం సంత రోజున ఒక కానిస్టేబుల్‌ను చౌరస్తాలో డ్యూటీలో పెడితే కొంతమేర రోడ్డుపైనే వాహనాల పార్కింగ్ తగ్గుతుందని.. తద్వారా ట్రాఫిక్‌జామ్ కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## అనుమతులిచ్చిందే బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలోని ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ అనుమతులను గత బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలే ఇచ్చాయని.. కానీ నేడు పనులు చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని టీపీసీసీ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. గుమ్మడిదల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. అప్పట్లో వారు ఇచ్చిన అనుమతి పత్రాలతో గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్దకు కాంగ్రెస్ నాయకులం రావడానికి సిద్ధంగా ఉన్నామని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే వారు కూడా రావాలన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో గత కేసీఆర్ సర్కార్ ఇచ్చిన అనుమతులను తీసుకొని ప్రజాక్షేత్రంలోకి వెళ్తామన్నారు. కేవలం గత పాలకులు చేసిన తప్పిదం వల్ల నల్లవల్లి, ప్యారానగర్, కొత్తపల్లి, గుమ్మడిదల, తదితర గ్రామాల రైతులు ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటును అఖిలపక్ష ఆధ్వర్యంలో తిరస్కరించడానికి అందరం కలిసికట్టుగా సంబంధిత అధికారుల వద్దకు వెళ్దామన్నారు. అటవీ ప్రాంతం కలుషితంతోపాటు వ్యవసాయ ఆధారిత పంటలు పూర్తిగా నాశనమవుతాయని వాటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం సమాలోచన చేసి వెంటనే డంపింగ్ యార్డ్ ఏర్పాటను నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు, మాజీ మండల అధ్యక్షులు మద్ది వీరారెడ్డి,ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గౌడ్, వడ్డే కృష్ణ, యువ నాయకుడు మద్ది ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌ను వెంటనే సవరించాలి

- ఆశాలకు, కార్మిక వర్గానికి అరకొర నిధులు కేటాయించడం దుర్మార్గం
- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-సిర్గాపూర్




ఆశా వర్కర్లకు, కార్మిక వర్గానికి కేంద్ర బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడం దుర్మార్గమని.. వెంటనే బడ్జెట్ సవరించాలని డిమాండ్ చేస్తూ సిర్గాపురం మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఖేడ్ ఏరియా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల స్కీం కేంద్ర ప్రభుత్వ బాధ్యతని.. అయితే ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం దిశగా బడ్జెట్ కేటాయింపు చేయలేదన్నారు. బడ్జెట్‌ను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రూ.18వేల వేతనం చెల్లిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయంపై అస్సలు మాట్లాడక పోవడం విచారకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన స్కీముల్లో భాగంగా సర్వేలన్నీ ఆశ వర్కర్స్ ముందుగా చేసి ప్రభుత్వా లకు అప్పగిస్తారన్నారు. అలాంటి వారికే జీతాల పెంచకపోవడం, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లపై పనిభారం తగ్గించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలన్నారు. పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్న క్రమంలో ఆశా వర్కర్ల సమస్యలపై స్థానిక ఎంపీలు పార్లమెంట్లలో మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు భారతి, అంబిక, సాయవ్వ, నాగమణి, లక్ష్మీ హేమలత, జూలీ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మెదక్
3
శనివారం | 08 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

## మాత రమాబాయి జయంతి



**నవతెలంగాణ-నిజాంపేట**

మండల పరిధిలోని నస్కల్ ఎస్సీ కాలనీలోని గురువారం దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో మాత రమాబాయి 127వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత భోజన ఫ్రెంట్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్ మాట్లాడుతూ తల్లీ రమాబాయి తన నల్గురి పిల్లల్ని సమాజానికి త్యాగం చేసిన త్యాగమూర్తి, ఉద్యమ నాయకురాలు రమాబాయి అన్నారు "మహాడ్ సత్యాగ్రహం"లో దాడికి గురైన వారిని పరపర్శించారు. "కాలారాం మందిర్ ఉద్యమాని"కి అన్ని రకాల సహాయం అందించిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. ఇదేకాకుండా షాహు మహారాజ్, ప్రబోధన్కర్ ఠాక్రే అంబేడ్కర్ లాంటి మహనీయుల మధ్య ఉద్యమ చర్చలకు ఊతమిచ్చిన స్ఫూర్తి ప్రదాత రమాబాయి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, కవిత, సిరి, అనుషవ్వ, టేక్మాల్ యాదమ్మ, వాణి, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

## 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



**నవతెలంగాణ-తూప్రాన్**

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని అల్లాపూర్ టోల్ ప్లాజా వద్ద అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడి చేసి శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సూరారం నుంచి రామాయంపేటకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో రేషన్ బియ్యం తరలిస్తున్న లక్ష్మణ్‌తో పాటు వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

## రుణాల కోసం నేరుగా కలవాలి

- ఎస్‌బీఐ మేనేజర్ రామేశ్వర్ రెడ్డి



**నవతెలంగాణ-తూప్రాన్**

రైతుల దగ్గరికి వెళ్లి మెరుగైన వ్యవసాయం కోసం, అధిక దిగుబడి కోసం పెట్టుబడి కోసం రుణం అందజేస్తున్నామని ఎస్‌బీఐ మేనేజర్ రామేశ్వర్ రెడ్డి తెలిపారు. రైతులను చైతన్య పరుస్తూ ఊరూరూ, ఇంటింటికీ తిరిగి ఖాతాదారులకు సేవలు అందిస్తున్నామన్నారు. రుణ మాఫీ పొగా మిగితా డబ్బులు చెల్లించి అధిక రుణం తీసుకుని బాగుపడాలని రైతులకు హితబోధ చేస్తున్నారు. బ్యాంకు రుణాల కోసం నేరుగా తనను కలవ వచ్చని తెలిపారు. బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ రామేశ్వర్ రెడ్డి ఖాతాదారులకు సూచించారు.

## బాధిత కుటుంబానికి మహేష్ గుప్త సహకారం



**నవతెలంగాణ-శివ్వంపేట**

ఇటీవలే శుభకార్యానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని టిక్యా దేవమ్మగూడ తాండకు చెందిన నేనావత్ ఆంజనేయులు కుటుంబాన్ని జెడ్పీ మాజీ ఆర్థిక, ప్రణాళిక సంఘం సభ్యులు, శివ్వంపేట మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త శుక్రవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తనవంతు సహాయంగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు ఆంజనేయులు మరణించడం బాధాకరమని, ఆయన కుటుంబానికి మరింత సహకారం అందిస్తామన్నారు. గిరిజన కుటుంబానికి సహాయం అందించిన మాజీ జెడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు రవి నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైస్ రాజేందర్ నాయక్, కోలా పూల్ సింగ్, రాందాస్ నాయక్, గొప్య నాయక్, మాన్య నాయక్, దీక్ష, తేజ, హనుమంతు, కోటి, విఠల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**నవతెలంగాణ-నార్సింగి**

శంకరం పేట మండలం మిర్జాపల్లి గ్రామానికి చెందిన సంధిగారి మహేష్ గౌడ్ మరణించిన విషయం తెలుసు కొని ఎస్.ఆర్.సి ఆటో యూనియన్ (నార్సింగి) అధ్యక్షుడు మైలారం రవీందర్ (ఆటో జానీ) మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మీర్జాపల్లి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబ సభ్యులకు జానీ తన వంతు సహాయంగా ఐదు వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా జానీ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న కుటుంబానికి ఎస్.ఆర్.సి ఆటో యూనియన్ ద్వారా తమ తోటి ఆటో డ్రైవర్‌కు మానవతా దృక్పథంతో సహాయాన్ని అందించామన్నారు. ఎల్లప్పుడూ మహేష్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మిర్జాపల్లి ఆటో యూనియన్, ఎస్.ఆర్.సీ ఆటో యూనియన్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


## పెద్దమ్మ తల్లికి పూజలు చేసిన ఎమ్మెల్యే



**నవతెలంగాణ-మెదక్**

మెదక్ మండలంలోని గుట్టకింది పల్లి గ్రామంలో ఉన్న పెద్దమ్మ దేవాలయంలో శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ ఏ నియోజకవర్గానికి ప్రత్యేకమైన నిధులు కేటాయించి అభివృద్ధిలో అగ్రంగా నిలబెట్టేందుకు తీవ్రమైన కృషి చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట గ్రామ నాయకులు మండల నాయకులు ఉన్నారు.

## 17న ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు



**నవతెలంగాణ-శివ్వంపేట**

శివ్వంపేట శ్రీ బగలాముఖీ శక్తిపీఠంలో ఈ నెల 17న సోమవారం శక్తిపీఠం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా సంఖ్యాయనాది తంత్రశాస్త్రాలలో మహర్షులు చెప్పిన విధంగా దశమహా విద్యలతో కూడి పసుపు నీటి కందకంలో వెలసిన శక్తిపీఠం బగలాముఖి ఆలయ ద్వితీయ వార్షికవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు బగలాముఖీ ట్రస్టు చైర్మన్, అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ట్రస్టు సభ్యులు జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్, శాస్త్రుల పురుషోత్తం శర్మ, పబ్బ మహేష్ గుప్త, దర్శనం వెంకటరమణ శర్మ,పత్రాల శ్రీనివాస్ గౌడ్‌లు తెలిపారు. అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ట్రస్టు సభ్యుల సహకారంతో 17న ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనము, ప్రధాన దేవతా మండపస్థాపన నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 9 గంటలకు అగ్నిప్రతిష్ఠ, బగలాముఖీ మహామంత్ర హవనములు, మహాభిషేకములు, గంగ, గోదావర్యాది పుణ్యతీర్థములతో కూడిన అష్టోత్తర శత (108) కలశ స్థాపన, కలశ జలములతో అమ్మవారికి మహాభిషేకము, అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన పసుపుతో సహస్ర పుష్పసహిత హరిద్రార్చన నిర్వమిస్తున్నామని తెలిపారు. 12 గంటలకు పూర్ణహుతి శ్రీబగలాముఖీ దేవి పల్లకిసేవ, మహామంగళనీరాజనం, తీర్థప్రసాద వియోగము, 1 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అమ్మవారి ఉపాసకులు వెంకటేశ్వర శర్మ తెలిపారు. అమ్మవారి అనుగ్రహంతో కొనసాగనున్న విశేష ఉత్సవాలకు జిల్లాలోని అమ్మవారి భక్తులందరూ, శివ్వంపేట మండల భక్త జనులందరు కూడ అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి దీవెనలు అందుకోవాలని ఆయన సూచించారు.

## నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

**పట్టణ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ నవీన్**

**నవతెలంగాణ-మెదక్**

పట్టణంలోని అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ఆయా పనులు చేపట్టనున్నందున పట్టణంలో శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, పట్టణ ఏఈ నవీన్ తెలిపారు. వేసవి కాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పట్టణంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, ఇతర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కావున పట్టణంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏడీఈ, ఏఈలు పేర్కొన్నారు. ఈ విషయంలో పట్టణ ప్రజలు సహకరించాలని ఏడీఈ మోహన్ బాబు, ఏఈ నవీన్‌లు కోరారు.

## మాజీ ఎమ్మెల్యేను ఆహ్వానించిన డాక్టర్ మోహన్ నాయక్



**నవతెలంగాణ-నిజాంపేట**

లీలా గ్రూప్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ మోహన్ నాయక్ శుక్రవారం మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును హైదరాబాదులోని ఆయన గృహంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. రామాయంపేటలో నిర్వహించే నల్ల పోచమ్మ బోనాలు ద్వితీయ వార్షికోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఈ నెల 16న తన క్షేత్రంలో నల్ల పోచమ్మ బోనాల పండుగ చేయడం జరుగుతుందని, అందుకు మైనంపల్లి హనుమంతరావు తప్పకుండా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జఖ్యర్ తాండ మాలోతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనమైన మల్లన్న సాగర్

- ఏడు గ్రామపంచాయతీలు విలీనం
- పెరుగనున్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ స్థాయి





**నవతెలంగాణ-గజ్వేల్**

గజ్వేల్ పట్టణం సంగాపూర్‌లో నిర్మించిన మల్లన్న సాగర్ నిర్వాసితుల కాలనీ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ డీ నోటిపై చేయడంతో ఏడు గ్రామపంచాయతీలు విలీనమ య్యాయి. పంచాయతీరాజ్ శాఖ ఆ ఏడు గ్రామాలను అధికారికంగా మున్సిపాలిటీలో విలీనం చేశారు. మున్సిపాలిటీ గ్రేడ్ మారడం కాకుండా వార్డుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మల్లన్న సాగర్ నిర్మాణంలో భాగంగా తొగుట మండలం బ్రాహ్మణ బంజేరుపల్లి, లక్ష్మాపూర్, ఏటిగడ్డ కిష్టాపూర్, పల్లె పహాడ్, వేముల గట్టు, కొండపాక మండలం పరిధిలోని రెండు గ్రామాలు సింగారం, ఎర్రవల్లి గ్రామాలు ముంపునకు గురైన విషయం తెలిసిందే. నాలుగు ఏండ్ల క్రితం గజ్వేల్ పట్టణంలో 600 ఎకరాలలో మల్లన సాగర్ కాలనీని నిర్మాణం చేపట్టారు. గత సంవత్సరం సెప్టెంబర్ లో గ్రామపంచాయతీలో ఓటర్ లిస్టు అధికారులు కొన్ని గ్రామాల లిస్టును పెండింగ్లో పెట్టారు. అదే సమయంలో రెండు రోజుల తరువాత 17 గ్రామ పంచా యతీల లిస్టును విడుదల చేసి ముంపు గ్రామాలను డీ నోట్ పై చేశారు. దీంతో ఆ గ్రామాలు గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనమైనట్లేనని ప్రత్యేకంగా ఉత్తర్వులు అవసరం లేదని అధికారులు చెబుతున్నారు.

**విలీన గ్రామాల్లో 15 వేల జనాభా.**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో విలీనం చేస్తున్న ఏడు గ్రామాల జనాభా 15 వేల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ గ్రామాల్లో ఏడు వేల పైచిలుకు ఓటర్స్ ఉన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో గజ్వేల్, ప్రజ్ఞాపూర్, ముట్రాజ్ పల్లి, సంగాపూర్, క్యాసారం, రాజిరెడ్డిపల్లి, సంగుపల్లి తదితర గ్రామాలలో సుమారు 60 వేలకు పైగా జనాభా ఉండగా విలీన గ్రామాలతో 80 వేల వరకు జనాభా చేరుకునే అవకాశం ఉంది.



**పెరుగనున్న వార్డుల సంఖ్య.**

మున్సిపాలిటీలో ప్రస్తుతం 20 వార్డులు ఉండగా వైశాల్యపరంగా వార్డులు పెద్దగా ఉన్నాయి. ఇందులోనే మరో ఐదు వార్డులను కొత్తగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా విలీన గ్రామాలతో కలిపి 32 లేదా 35 వరకు వార్డులయ్యే అవకాశం ఉంటుంది. విలీనం వ్యతిరేకిస్తే మాత్రం పాలకవర్గం ఆమోదించిన తీర్మానాన్ని ప్రభుత్వానికి అందజేయవలసి వస్తుంది.

**ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదు.**

గజ్వేల్ మున్సిపాలిటీలో మల్లన్న సాగర్ విలీనం అంశాన్ని కమిషనర్ నరసయ్య దృష్టికి నవతెలంగాణ రిపోర్టర్ తీసుకపోగాతమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య తెలిపారు.

## గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్ ద్వారా నీటి విడుదల

**నవతెలంగాణ-తూప్రాన్**

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్ నుంచి మున్సిపల్ తాజా మాజీ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో పెద్ద చెరువులోకి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్ద చెరువు కట్టకింద ఉన్న పంట పొలాలకు సాగునీరు అందించడమే ప్రధాన ఉద్దేశ్యంతో నీటిని విడుదల చేశామన్నారు. కిష్టాపూర్ హల్దీవాగు వద్ద ఏర్పాటు చేసిన గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్ ల ద్వారా పెద్ద చెరువులోకి నీటిని విడుదల చేశామని తెలిపారు. పట్టణంలోని బోరు బావుల భూగర్భ జలాల స్థాయిని పెంచడం కోసమే హల్దీవాగుపై గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్‌ను నిర్మించామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిల కృషితో నీటిని విడుదల చేశామని తెలిపారు. మండలం, మున్సిపాలిటీ పరిధి, పట్టణంలోని రైతులు పండించే పంటలు ఎండిపోకూడదని నీటిని విడుదల చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు కొడిప్యాక నారాయణ గుప్తా, పల్లెర్ల జ్యోతి రవీంద్ర గుప్తా, జిన్నా భగవాన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిమ్మాపురం నర్సింలు, మామిండ్ల శ్రీనివాస్, పాల్గొన్నారు.



## మినరల్ వాటర్ అందించడం అభినందనీయం

- మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త

**నవతెలంగాణ-శివ్వంపేట**

గ్రామస్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్తులందరికి కూడ మినరల్ వాటర్‌ను అందించడం అభినందనీయమని మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త అన్నారు. మండలంలోని రత్నాపూర్ గ్రామంలో రవీందర్ గౌడ్ నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేష్ గుప్త మాట్లాడుతూ పట్టణాలలో మాదిరిగా మారుమూల ప్రాంతాలలో కూడ ఇలాంటి మంచి కార్యక్రమాలను చేపట్టడం సంతోషకరమని, అందుకు రవీందర్ గౌడ్‌ను అభినందించారు.

**బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం**

రత్నాపూర్ గ్రామానికి చెందిన కండెగారి కృష్ణ, కమ్మరి నాగరాజు కుటుంబాలకు మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త ఆర్థిక సహాయం అందజేశారు.



ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొగ్గుల సాలమ్మ, వేమారెడ్డి, కుమ్మరి శంకర్, బొగ్గుల యాదగిరి, చెర్విరాల అశోక్ కుమార్ గుప్త, చిక్కుడు బాలేష్, బొగ్గుల శ్రీనివాస్, ఉట్ల భాస్కర్, ఉట్ల శ్రీనివాస్, బెస్త మల్లేష్, బొగ్గుల విజయ్, గంట రాములు, బొగ్గుల సత్తయ్య, రాజేందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్యారానగర్ డంపు యార్డును నిలుపుదల చేయండి

- మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త



**నవతెలంగాణ-శివ్వంపేట**

సకల ప్రాణులకు నష్టం కలిగించే విధంగా సంగారెడ్డి జిల్లా, గుమ్మడిదల మండలం ప్యారానగర్ శివారులో ప్రభుత్వం అక్రమంగా చేపట్టిన దంపు యార్డును వెంటనే నిలుపుదల చేయాలని జిల్లా ఆర్థిక, ప్రణాళిక సంఘం సభ్యులు, శివ్వంపేట మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పచ్చటి అటవీ అందాలను, అందులో నివసించే జీవరాసులు, జల రాసులపై పూర్తిగా ప్రభావితం చేసే దంపు యార్డు వల్ల నర్సాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు పూర్తిగా కాలుష్య కోరల్లోకి వెళ్లి, నీరు, గాలి, ప్రకృతిని సర్వ నాశనం చేసే డంపింగ్ యార్డు పనులను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ పరిశుభ్రమైన నీరుతో జీవనం సాగిస్తూ పూర్తిగా వ్యవసాయం చేసుకుంటూ పంటలపైనే ఆధారపడిన గ్రామాలు, రైతన్నలకు తీవ్రంగా నష్టపరిచే ప్యారానగర్ డంపు యార్డును ఇక్కడి ప్రజానికమంతా వ్యతిరేకస్తున్నా గాని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్యాయంగా డంపింగ్ యార్డ్ చేపట్టడం నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలపై కక్షకట్టడమేనన్నారు. అక్రమ డంప్ యార్డు నిర్మాణాన్ని ప్రభుత్వం నిలుపుదల చేయకుంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో తాలూకా ప్రజలమంతా కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

## కాంపౌడ్ వాల్ సరే.. బస్టాండ్ నిర్మాణమేది..?



**నవతెలంగాణ-నిజాంపేట**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో బస్టాండ్లు కట్టించాలని ప్రభుత్వం పదేపదే చెప్తున్నది. కానీ ఇప్పటికీ మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు 30 సంవత్సరాల క్రితం మండల కేంద్రంలోని పాత బస్ స్టాప్ వద్ద బస్టాండ్ కట్టించాలని ఉద్దేశంతో గ్రామానికి చెందిన చిన్నపైడి శ్రీనివాస్ రెడ్డి 20 గుంటల స్థలాన్ని ఆర్టీసీ అధికారులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం జరిగింది. దాదాపు ఒక సంవత్సరం క్రితం బస్టాండ్ స్థలాన్ని ఆర్టీసీ అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకొని కాంపౌండ్ వాల్ కట్టించారు. బస్టాండ్ కట్టించడం మాత్రం మరిచారని మండల ప్రజల ఆరోపిస్తున్నారు. పాత బస్టాప్ వద్ద బస్సులు ఆపక పోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు 30 సంవత్సరాల నుంచి బస్టాండు కట్టిస్తారనే ఆశతో ఎదురుచూస్తూ ఉన్నారు .కానీ ఆర్టీసీ అధికారులు కట్టించడం లేదని పలువురు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు మాత్రం బస్టాండ్ స్థలాన్ని హద్దు బందు చేసుకున్నారు. కానీ పాత బస్టాప్ వద్ద బస్సులు ఆపేలా ఆర్టీసీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మద్దూరు కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలుగా లలిత మల్లేశం

**నవతెలంగాణ-మద్దూరు**

మద్దూరు మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన గుండెగోని లలిత మల్లేశం, ను కాంగ్రెస్ పార్టీ మద్దూరు మండల మహిళా అధ్యక్షురాలిగా నియమిస్తున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత రావు, నియామక పత్రాన్ని శుక్రవారం లలిత మల్లేశంకు అందజేశారు. ఈ సందర్భంగా లలితా మల్లేశం మాట్లాడుతూ..తనపై నమ్మకంతో మద్దూరు మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలుగా తన నియమహకానికి సహకరించిన కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డికి, సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు ముధం లక్ష్మీ, జిల్లా నాయకులకు, నియోజకవర్గ నాయకులకు, మండల నాయకులకు, ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య

**నవతెలంగాణ-చేగుంట**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బలపరిచిన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య గెలిపించాలని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి. మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను కలుసుకొని, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, జీవో 317 సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, అన్ని పాఠశాల ఒకే విధంగా పని వేళలు ఉండాలని, పెండింగ్ డీఏ జీపీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ కార్పొరేట్ హాస్పటల్లో హెల్త్ కార్డులు పనిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, గురుకుల పాఠశాల సమస్యలను పరిష్కరించాలని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులందరికీ మినిమం పే స్కేల్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్సు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవత్ సురేష్, తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, దుబ్బాక నియోజకవర్గం అసెంబ్లీ కో కన్వీనర్ గోవింద్, తూప్రాన్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు జానకిరామ్ గౌడ్, నర్సింగ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాకేష్, తపస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, కృష్ణమూర్తి, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ యాత్రను జయప్రదం చేయాలి

- టీవీఏసి జేఏసీ జిల్లా చైర్మన్ బి.ఎస్.స్వామి



**నవతెలంగాణ-తూప్రాన్**

రాష్ట్ర టీవీఏసి జేఏసీ చైర్మన్ ఈశ్వరరావు, కన్వీనర్ నజీర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించే కన్వర్షన్ యాత్రను జయప్రదం చేయాలని మెదక్ జిల్లా చైర్మన్ బి.ఎస్.స్వామి కోరారు. విద్యుత్ ఆర్టిజన్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత నెల జనవరి 20 నుంచి 25 వరకు జిల్లా కేంద్రాల్లో నిరాహార దీక్షలు చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టిజన్ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఆర్టిజన్ల కన్వర్షన్ ను అమలు చేసిన తర్వాతనే జూనియర్ లైన్ మెన్, సబ్ ఇంజనీర్లు, ఆఫీస్ సబార్డినేట్లు, తదితర పోస్టులను భర్తీ చేయాలన్నారు.

## 3వ అడ్వకేట్ నోటరీ ప్రారంభం



**నవతెలంగాణ-తూప్రాన్**

తూప్రాన్ పట్టణం లోని నర్సాపూర్ చౌరస్తా వద్ద నూతనంగా గజం ఆనంద్ ఏర్పాటు చేసిన అడ్వకేట్ లాయర్, నోటరీ ఆఫీస్‌ను సీనియర్ లా యర్ పన్నాల శ్రీహరి లాంఛనంగా శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అడ్వకేట్ తీగల అభిషేక్ తో కలిసి గజం ఆనంద్ ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందిస్తున్నట్లు అడ్వకేట్ గజం ఆనంద్ తెలిపారు. గత కొన్ని నెలల క్రితమే తూప్రాన్ కు కోర్టు మంజూరి అయిన సంగతి అందరికి తెలిసిందే. పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు. మూడవ నోటరీ కార్యాలయం ప్రారంభంతో తూప్రాన్ ప్రాంత ప్రజలకు లాయర్లు ఉత్తమ సేవలు అందిస్తు న్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్ స్కూల్ డైరెక్టర్ కడిమే వరప్రసాద్, కడీమే మోజీస్, ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎం.డి అబ్దుల్ మజీద్, ఎం.డి అన్వర్ హుసేన్, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జానకిరామ్, వెంకటొల్ల శివకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**నవతెలంగాణ-హవేలీ ఘనపూర్**

ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఘటన మండల పరిధిలోని కాప్రయిపల్లి తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గంగమ్మ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు హవేలి ఘనపూర్ ఆర్ఐ ఆబేద్ సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌ను పట్టుకొని హవేలి ఘనపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

## చెరువులు నింపి రైతులను ఆదుకోవాలి

- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ భక్కి వెంకటయ్య



**నవతెలంగాణ-చేగుంట**

భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి, కాలువల ద్వారా చెరువులు నింపి రైతులను ఆదుకోవాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ భక్కి వెంకటయ్య పేర్కొన్నారు. మండలం బోనాల, ఇబ్రహీంపూర్ గ్రామాలలో చెరువుల ఆయకట్టు పోలాలను, బోర్లు గ్యాప్ ఇవ్వడాన్ని పరిశీలించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత జిల్లా అధికారులకు ఫోన్ చేసి రెండు మూడు రోజుల్లో చెరువులు నింపి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో కాలువల ద్వారా చెరువులకు నీళ్లు వస్తాయని, ఎవరు అధైర్య పడవద్దని, ఏదైనా సమస్య ఉంటే తమకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు లచ్చిరెడ్డి, స్వామి, శేఖర్, మాజీ సర్పంచ్ అబ్రమైన మల్లయ్య, నర్సింహులు, వెంకటరమణ, భూషణం, తదితరులు పాల్గొన్నారు.

## అక్కన్నపేట మండలం అభివృద్ధికి మంత్రి సానుకులత

**నవతెలంగాణ-అక్కన్నపేట**

హుస్నాబాద్ నియోజకవర్గంలోనే అక్కన్నపేట మండలం చాలా వెనుకబడిపోయిందని ఈ మండలంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి అన్నారు. అక్కన్నపేట అత్యధికంగా ప్రభుత్వ భూమి ఉన్నందున గ్రామంలో యువతీ, యువకుల కోసం ఆట స్థలానికి 5 ఎకరాల స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని అన్నారు. అలాగే ఎస్సీ కాలనీలో మురికి కాలువ నిర్మాణం, కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ కావాలని కోరారు. అలాగే బాలికల ఆశ్రమ పాఠశాల నిర్మాణా నికి ఏడెకరాల ప్రభుత్వ భూమి గుర్తించారని వెంటనే అక్కడ ఐదో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థినిలు చదువుకునేలా భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. అలాగే గ్రంథాలయ నిర్మాణానికి కూడా భారీగా నిధులు కేటాయించాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన శుక్రవా రం ఒక ప్రకటనలో తెలి యజేశారు.

## రామకోటి సంస్థ ఆధ్వర్యంలో రామ, శివ లిఖిత యజ్ఞం

**నవతెలంగాణ-గజ్వేల్**

లోకశాంతి కొరకు గ్రామ, గ్రామాన నిర్వహిస్తున్న రామ,శివ లిఖిత మహాయజ్ఞం శుక్రవారం రామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో కృష్ణాలయంలోని రామాలయం వద్ద 2గంటల పాటు రామనామ స్మరణ మధ్య రామ,శివ నామాలను లిఖించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, రామకోటి రామరాజు కి దేవాలయంలోనే అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు యెలగందుల రాంచంద్రం, కోశాధికారి దూబకుంట మెత్రాములు, సెక్రెటరీ ఉప్పల వెంకటేశం, అత్తెల్లి లక్ష్మయ్య, అంతునూరి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సిద్దిపేట
శనివారం | 08 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

## నులి పురుగుల నిర్మూలన దినోత్సవంను విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరిలి



**నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్**

జిల్లా కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ వారు జారీచేసిన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ అవగాహన పోస్టర్‌ని జిల్లా కలెక్టర్ ఎం.మనూ చౌదరి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న సిద్దిపేట జిల్లాలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, జిల్లాలో 2 లక్షల 42 వేల చిన్నారులుకు ఏడాది నుండి 19 ఏండ్లు వయసు గల వారు ఉన్నారని, నులి పురుగులను నివారించడంలో ఉపయోగపడే అల్బెండాజోల్ మాత్రలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని వీరందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జిల్లాలోని అన్ని పాఠశాలలో, ఆరోగ్య కేంద్రాల్లో అంగన్వాడి కేంద్రాల్లో, కళాశాలలో ఆల్బెండజోల్ మాత్రలు ఆరోగ్య సిబ్బంది ద్వారా వేయడం జరుగుతుందని, తద్వారా నులిపురుగుల ద్వారా వచ్చే ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని, తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. పల్విన్ కుమార్, ఏవో నవీన్ రాజ్ కుమార్, డిప్యై. ఎస్ ఓ శ్రావణి ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అందమైన చేతిరాతపై శిక్షణ



**నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్**

సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందమైన చేతిరాతపై శిక్షణ అందించారు. పొన్నాల గ్రామస్తులు దారబోయిన సంపత్ యాదవ్, పెండ్యాల శ్రీనివాస్ రెడ్డిలు ఒక్కో విద్యార్థికి రూ.150 విలువ గల మొత్తం రూ.15వేలు విలువగల చేతిరాత పుస్తకాలను విద్యార్థిని విద్యార్థులకు అందించి, చేతిరాత నిపుణులు అయిన ఏజాజ్ అహ్మద్ చేత చేతిరాతపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముత్యాలు లాంటి చేతిరాత వ్యక్తిలోని అసాధారణ ప్రతిభ పాటవాలు వెలికి తీయవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా దాతల సహకారం మరువలేదని తెలుపుతూ చేతిరాత నిపుణులు ఏజాజ్ అహ్మద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే. వేణుగోపాల్ చారి, సౌజన్య సుధా, శ్రీవిద్య , జి. స్వప్న, ఆర్. తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఉత్పత్తులు సృష్టించి రైతులకు అందించాలి

- తోర్నాల వ్యవసాయ విశ్వవిద్యాలయం సందర్శన
- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి



**నవతెలంగాణ-సిద్దిపేటరూరల్**

వ్యవసాయంలో నూతన ఉత్పత్తులు సృష్టించి రైతులకు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని తోర్నాల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఆయనకు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయం 110 ఎకరాల విస్తీర్ణంలో ఉందని ఇందులో వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ పరిశోధన కేంద్రం ఉందని పాలిటెక్నిక్‌లో పదో తరగతి తర్వాత ఇక్కడ రెండు ఏండ్ల కోర్సుని అందిస్తున్నట్లు కళశాల ప్రిన్సిపల్ శ్రీదేవి కలెక్టర్‌కి తెలిపారు. తరగతి గదులు లాబొరేటరీ గదులు అన్ని పరిశీలించారు. అనంతరం పాలిటెక్నిక్ విద్యార్థులతో కాసేపు ప్రశ్నలు అడుగుతు వారితో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల, ముడి పదార్థాల అవసరాలను తీర్చడం ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం అత్యంత ప్రబలమైన రంగంమని ఎందుకంటే జనాభాలో అధిక శాతం మంది జీవనోపాధి కోసం వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నారన్నారు. ఇంటిగ్రేటెడ్ సేద్యం వ్యవస్థలు, మైక్రో ఇరిగేషన్ సిస్టమ్స్ ద్వారా నీటి నిర్వహణ సహా సమగ్ర నీటి నిర్వహణ కార్యకలాపాలు సేంద్రీయ వ్యవసాయ ప్రోత్సహించడం ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుదల ఫీల్డ్ స్థాయిలో శిక్షణలు, ప్రదర్శనలు సమీకృత పోషక నిర్వహణ, ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్మెంట్ పద్ధతులు స్వీకరించడం ద్వారా సాగు ఖర్చును తగ్గించాలనే లక్ష్యంగా ఉండాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తిలో స్థిరత్వాన్ని నిర్ధారించడం, పెరుగుతున్న జనాభా ఆహార అవసరాన్ని తీర్చడానికి బయో-కంట్రోల్ ఏజెంట్ల ఉత్పత్తి, పంపిణీ లక్ష్యంగా రసాయనాల నుంచి పర్యావరణాన్ని కాపాడటంతోపాటు సాగు ఖర్చు తగ్గించడం, లాభాలను పెంపొందించడం ద్వారా రసాయనిక పురుగుమందుల మీద రైతులు ఆధారపడటాన్ని తగ్గించడం సూచించాలన్నారు. ఈ రెండు సంవత్సరాల కోర్సులో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకుని వ్యవసాయంలో ఒక నూతన ఒరవడులను సృష్టించి రైతులకు లాభం చేకూర్చేలా మీ విద్య కొనసాగాలని విద్యార్థులకు సూచించారు.

## స్వాతంత్ర్య పాలనలో కుల వివక్ష కొనసాగడం అమానుషం

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య



**నవతెలంగాణ-సిద్దిపేట**

78 ఏళ్ళ స్వాతంత్ర్య పాలనలో కుల వివక్ష కొనసాగడం అమానిషమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సతీమణి అమ్మ రమాబాయి 127 వ జయంతిని సిద్దిపేట ఉపాధ్యాభవన్ లో సామాజిక, ప్రజా సంఘాల అధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ పూల మాలలు వెసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్ళవుతున్న నేటికి కుల దురంహాకార హత్యలు జరగడం క్షమించరానిదన్నారు. నగరంలో దళితులకు ఇంటి కిరాయి ఇవ్వకుండా కుల వివక్ష పాటిస్తున్నారన్నారు. అంబేద్కర్ రమాబాయి లు కొవ్వొత్తి ల కరిగి పొతు కోట్లాది మంది జీవితాలలో వెలుగులు నింపారన్నారన్నారు. తన పిల్లలు అనారోగ్యాలకు గురై మరణిస్తున్న తల్లి రమాబాయి అంబేద్కర్ చదువులకు డబ్బులు ఇచ్చి అంబేద్కర్ ను నిలపెట్టి న మహ త్యాగి రమాబాయి అని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కొనియాడారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయ నేత ఆస లక్ష్మణ్, డిబిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్ల శంకర్, కవి గాయకులు భీమ సేన, సామాజిక వేత్త పొచబోయిన శ్రీహరి యాదవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ కాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీవో అనుమతితో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలి



**నవతెలంగాణ-సిద్దిపేట**

ఉపాధ్యాయ, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టణంలో ఎన్నికల కోడ్ ఉన్నందున ఎవరైనా రాజకీయపరమైన ప్రచార ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు వేయదలచినట్లైతే ఆర్డీవో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. శుక్రవారం ఎన్నికల కోడ్‌లో భాగంగా కమిషనర్ మున్సిపల్ పరిధిలో మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాన్ని ఏర్పాటుచేసి, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పట్టణంలో ఉన్న రాజకీయపరమైన ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్ పోస్టర్లు తొలగించాలని ఎంసీసీ బృందాన్ని ఆదేశించారు.

## బల్బు తయారీపై విద్యార్థులకు శిక్షణ



**నవతెలంగాణ-సిద్దిపేట**

పట్టణంలోని క్రాంతి పాఠశాలలో విద్యార్థులకు బల్బు తయారీపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు పాంశాల డైరెక్టర్ భగవాన్ రెడ్డి తెలిపారు. ప్రముఖ శిక్షకులు, ఆవిష్కర్త మల్లేశం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మా విద్యార్థులు కేవలం సైద్ధాంతిక జ్ఞానంతోనే కాకుండా, ఆచరణాత్మక నైపుణ్యాలతో కూడా ముందుకు సాగాలనే ఆకాంక్షతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పాఠశాల చైర్‌పర్సన్ అర్పిత మాట్లాడుతూ..విద్యార్థులు ఇలాంటి ఆచరణాత్మక అనుభవం పొందడం చాలా ముఖ్యమని, ఇది వారి భవిష్యత్తు కెరీర్‌కు బాగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అండగా ఉంటాం

- మండల మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి



**నవతెలంగాణ-తొగుట**

మాదారం నర్సయ్య కుటుంబానికి అండగా ఉంటామని మండల మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కాన్గల్ గ్రామానికి చెందిన మాదరం యేసెబ్ తండ్రి నర్సయ్య (70) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడు. వారి కుటుంబానికి శ్రీకాంత్ రెడ్డి 50 కేజీల బియ్యాన్ని బీఆర్ఎస్ నాయకులతో పంపించారు. వారు మాట్లాడుతూ గత కొన్ని సంత్సరాల క్రితం నర్సయ్య గ్రామ పంచాయతీ కార్మికునిగా పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు లింగు పల్లి బాలరాజు, సీనియర్ నాయకుడు మాధారం ప్రశాంత్, నర్సింలు, శివ తదితరులు ఉన్నారు.

## ఎన్నికలలోపు రైతు భరోసా పూర్తి చేయాలి



**నవతెలంగాణ-గజ్వేల్ :** స్థానిక సంస్థల ఎన్నికల లోపు పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ, రైతు భరోసా అందించాలని బీజేపీ గజ్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు నాయిని సందీప్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అందాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అన్ని వార్డుల ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. దరఖాస్తుల పరిశీలన పేరిట జాప్యం చేస్తే బిజె పి ఆందోళన చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పేదలకు అందుతున్నాయని ఆయన గుర్తు చేశారు.

## డాక్టర్ భాస్కర్ అమీరిశెట్టికి వైద్య శిరోమణి అవార్డు



**నవతెలంగాణ-సిద్దిపేట**

పట్టణంలోని లోహిత్ సాయి హాస్పిటల్ చైర్మెన్ డాక్టర్ భాస్కర్ అమీరిశెట్టికి వైద్య శిరోమణి అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో తేజస్విని కల్చరల్ సొసైటీ వారి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్య రంగానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా అవార్డు వచ్చినట్లు తెలిపారు. పలువురు డాక్టర్లు భాస్కర్‌ను అభినందించారు.

## నిశ్చితార్థం వేడుకలకు హాజరైన నాయకులు



**నవతెలంగాణ-మర్కుక్**

మండల పరిధిలోని కాశిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అప్పాల స్వరూప-మల్లేశం కుమారుడు అప్పాల రాకేష్ నిశ్చి తార్థం వేడుకలకు యా దాద్రి-భువనగిరి జిల్లా యాదగిరిపల్లెలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హల్‌లో శుక్రవారం జరిగింది. ఈ నిశ్చితార్థం వేడుకలకు మాజీ జెడ్పీటీసీ సంగం సత్తయ్య, వేముల ఘట్టు మాజీ సర్పంచ్ సిద్దిపేట ఎల్లంలు కలసి నూతన వధువరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు జాలని యాదగిరి, బాలరాజ్ మహిపాల్ రెడ్డి, నరసింహ రెడ్డి, కటకం అరవింద చారి, రవి, నాయకులు తదితరులున్నారు.

## నోరి పురస్కారానికి ఎంపికైన మంచినీళ్ళ సరస్వతి రామశర్మ



**నవతెలంగాణ-సిద్దిపేట**

కవి సామ్రాట్ నోరి నరసింహశాస్త్రి 126వ జయంతి సందర్భంగా అందజేస్తున్న నోరి సాహిత్య పురస్కారానికి సిద్ధిపేటకు చెందిన కవయిత్రి మంచినీళ్ళ సరస్వతి రామశర్మ ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పురస్కారం ఆదివారం ఉప్పల్ లో జరు గు కార్యక్రమంలో అందించనున్నారు. సాహిత్యంతో పాటు, ఆధ్యాత్మికంగా కృషి చేస్తున్న మంచినీళ్ల సరస్వతి రామశ ర్మ నోరి సాహిత్య పురస్కారానికి ఎంపిక కావడం పట్ల సిద్దిపేట సాహితీవేత్తలు వేలేటి మృత్యుంజయశర్మ, రుక్మాభట్ల నృసింహశర్మ చెప్పేల హరినాథ్ శర్మ, ఉండ్రాళ్ళ రాజేశం, సింగీతం నరసింహరావు, తదితరులు అభినందనలు తెలిపారు.

## నవ వధువుకు పుస్తె మట్టెలు అందజేత



**నవతెలంగాణ-మర్కుక్**

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన చెక్కల పెంటమ్మ నర్సింలు కూతురు మమత వివాహానికి పుస్తె మట్టెలను బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మేకల కనకయ్య ముదిరాజ్ పుస్తే మట్టేలను శుక్రవారం అందజేశారు.ఆయనతో పాటు చెక్కల మల్లేశం, చెక్కల కరుణాకర్, కొట్టాల మహేష్, తదితరులున్నారు.

## అట్టహాసంగా వంగ మహేందర్ రెడ్డి నామినేషన్



**నవతెలంగాణ-సిద్దిపేట**

కొనాయిపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నామినేషన్ పత్రాలకు ప్రత్యేకంగా పూజ నిర్వహించి, పాత బస్టాండ్‌లో అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, రంగధాంపల్లి చౌరస్తాలో అమరవీరుల స్థూ పానికి నివాళు లర్పించి కరీంనగర్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా నామినేషన్ వేయడానికి టీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి శుక్రవారం వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధ్యాయుల సేవకే నా జీవితం అంకితమని, ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ కోసం నిరంత రం కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ నిధులన్నీ ప్రభుత్వ పాఠశా లల కోసమే ఖర్చు చేస్తానని తెలిపారు. వీఎంఆర్ ఫౌండే షన్ ద్వారా అనేక పాఠశాలలకు సేవలు అందించా నని, ఎమ్మెల్సీగా గెలిపిస్తే జీవితాంతం విద్యారంగ, ఉపాధ్యాయుల సమాజసేవలో పునరాంకితమవుతానన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షులు మలుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్ శర్మ పిఆర్టియు శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా 6వ మహాసభలను జయప్రదం చేయండి

- ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మైసంపల్లి రాహుల్, తాడూరి భరత్ కుమార్



**నవతెలంగాణ-మద్దూరు:** ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా6వ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మైసంపల్లి రాహుల్, తాడూరి భరత్ కుమాం"లు కోరారు. ఈ సందర్భంగా మద్దూరు మండల కమిటీ యూనిట్ కమిటీలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈనెల 20, 21 తేదీల్లో జరగబోయే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ ఏడాదిగా పట్టించుకోవడంలో విఫలం అయితుం దని తెలియజేశారు. రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యను పట్టించుకునే నాథుడు లేడని విద్యారంగా సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రి నియమించాలని లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అభిలాష్, రోహిత్, శ్రీకాంత్ ,అశ్విత, మహేశ్వరి, మీనాక్షి, మానస, తదితులు పాల్గొన్నారు.

## హామీలపై ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్‌ను నిలదీయాలి

- బీఆర్ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్



**నవతెలంగాణ-మద్దూరు**

కాంగ్రెస్ మోసపూరిత హామీలపై ప్రజాక్షేత్రంలో నిలదీయాలని బీఆర్ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని లద్నూర్ గ్రామంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నహక గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందుకు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో నిలదీయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మద్దూరు మాజీ వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమ మల్లేశం, క్లస్టర్ ఇంచార్జిలు ముస్త్యాల నాగేశ్వరరావు, బురగోని తిరుపతి గౌడ్, బిరెడ్డి ఇన్నారెడ్డి, బుడిగ శ్రీను గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ ఇర్రి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ సుదర్శన్, గ్రామ శాఖ అధ్యక్షుడు నంద శ్రీను, మాజీ ఉపసర్పంచ్ కుమారస్వామి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలను పాటించాలి

- తొగుట సిఐ షేక్ లతీఫ్



**నవతెలంగాణ- దౌల్తాబాద్**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలందరూ తప్పని సరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తొగుట సిఐ షేక్ లతీఫ్ అన్నారు. గురువారం రాత్రి దౌల్తాబాద్ మండలం మల్లేశంపల్లి గ్రామంలో పోలీస్ కనువిప్పు ద్వారా ప్రజలకు మూఢనమ్మకాలు, చట్టాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మద్య పానం, డ్రగ్స్ గంజాయి ఇతర మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.హెల్మెట్ ,సీట్ బెల్ట్ పెట్టుకుని వాహనాన్ని డ్రైవ్ చేయాలి. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ కార్యక్ర మంలో దౌలబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్, పోలీస్ కళాకా రులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు రవి, రవీందర్, ఎల్లయ్య, తిరుమ లయ్య, బాబాయి, క్రాంతి కుమార్, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తా

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి



**నవతెలంగాణ-నంగునూరు**

మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ అధికారిక అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంగ మహేందర్ రెడ్డి, కవిత దంపతులు సిద్దిపేట నియోజక వర్గంలోని నంగునూరు మండలం చారిత్రక కోనాయిపల్లిలోని సెంటిమెంట్ ఆలయం అయిన వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా నామ పత్రాలను స్వామి వారి పాదాల వద్ద పెట్టి అర్చనలు చేశారు. స్వామి సన్నిధిలో నామ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించి మహేందర్ రెడ్డిని ఆశీర్వదించారు. ప్రత్యేక పూజల అనంతరం పీఆర్టీయూ కార్యకర్తలతో కలిసి వెళ్ళి సిద్దిపేటలోని రంగధాంపల్లి చౌరస్తాలో అమరవీరుల స్థూపా నికి నివాళులు అర్పించారు. ఇక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తాలోని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యా యుల సేవకే తన జీవితం అంకితం చేస్తానని తెలిపా రు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. తాను ఎమ్మె ల్సీగా విజయం సాధిస్తే ఎమ్మెల్సీ కోటా కింద మంజూరయ్యే నిధు లను ప్రభుత్వ పాఠశాలల కోసమే ఖర్చు చేస్తానని తెలిపారు. తన అభ్యర్థిత్వానికి మ్యాండేట్ ఇచ్చిన పీఆర్టీయూ నాయకత్వానికి కార్యకర్తలకు, అభ్యర్థి త్వానికి మద్దతు తెలుపుతున్న ఇతర ఉపాధ్యాయ అధ్యాపక సంఘాల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పీఆర్టీయూ, ఇతర అధ్యాపక సంఘాల కార్యకర్త లతో కలిసి ర్యాలీగా కరీంనగర్ వెళ్లి నామ పత్రాలను దాఖ లు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లు గారి ఇంద్రసేనా రెడ్డి, ఆదరాసుపల్లి శశిధర్ శర్మ పాల్గొన్నారు.

## సహచర్యానికి నిలువెత్తు నిదర్శనం రమాబాయి

- డీబీఎఫ్ రాష్ట్రకార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



**నవతెలంగాణ-గజ్వేల్**

మాతా రమాబాయి బాబాసాహేబ్ డా. అంబేద్కర్ భార్యగా కేవలం కొందరికే తెలుసు కాని ఒక మహోన్నత వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన మహోపాధ్యాయురాలు. చదువుకోకపోయిన విద్య విలువను ఔపాసన చేసిన మహిళ మాత రమాబాయి 127 వ జయంతిని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం గజ్వేల్ ఎస్టీ హస్టల్ విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించి నివాళ్ళలర్పించారు. ఈ సందర్భంగా ఏగొండ స్వామి మాట్లాడుతూ మాత రమాబాయి ఏప్రిల్ 4, 1906 లో డా.అంబేద్కర్ తో వివాహం జరిగింది. ఆమెకు 5 గురు సంతానం. యశ్వంత్, గంగాధర్,ఇందు( కూతురు), రాజరత్న, యశ్వంత్ 1977 వరకూ జీవించి ఉండగా మిగిలిన ముగ్గురూ చిన్న వయసులోనే చనిపోవడానికి ప్రధాన కారణం- పేదరికం, ఆకలి, అనారోగ్యమన్నారు. బిడ్డలను అర్ధాకలితో ఉంచుతూ ,ఆమె ఆకలి పడుతున్న రాత్రులు లెక్కలేనన్ని ఉన్నాయి. అప్పుడప్పుడు ఆమె కష్టపడి సంపాదించిన సొమ్మును డా. అంబేద్కర్ కు పంపుతూ అతడి ఆశయ సాధనకు ఆటంకం రాకుండా చూసుకోవడం లోనే ఆమె త్యాగం ఉందన్నారు. సాహచర్యానికి నిలు నెత్తి నిదర్శనం రమాబాయి. సహృదయరాలని, పరిపక్వత కలిగిన మహోన్నతరాలని, స్వచ్ఛమైన మనస్కురాలని ఆమెను ప్రస్తావించాడు. ఆమె ప్రతీ త్యాగం బాబాసాహెబ్ ద్వారా దేశానికి అంకితమైనది. ఈ కార్యక్రమంలో హస్టల్ వార్డన్ ,పిల్లలు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలో గెలుపొందిన స్పందన



**నవతెలంగాణ-జగదేవపూర్**

జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 2025 జనవరి 25న ప్రభుత్వ జూనియర్ కళాశాల జగదేవపూర్‌లో "ఓటు హక్కు వినియోగము- అందులో విద్యార్థుల యొక్క పాత్ర" అనే అంశంపై మండల రెవెన్యూ ఆఫీసర్ జగదేపూర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలో మొదటి బహుమతి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ రెండో సంవత్సరం విద్యార్థిని ధర్మారం గ్రామానికి చెందిన జుర్రు స్పందన గెలుచుకోన్నదన్నారు. అందుకుగాను కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న విద్యార్థి స్పందనను ప్రశంసా పత్రంతో అభినందించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి



**నవతెలంగాణ-కొమురవెల్లి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని క్లస్టర్ ఇంచార్జ్ అంకుగారి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రసులాబాద్ గ్రామంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి గౌడ్ అధ్యక్ష తన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ..రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బిక్షపతి, నాయకులు రజిత కృష్ణమూర్తి, సిద్ధ రాములు, మల్లేశం, కనకయ్య అబ్దుల్లా, ఎల్లయ్య ఐలేని, అశోక్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు

## చదువుకునే సమయంలో చెడు ఆలోచనలు రానివ్వద్దు

- రూరల్ సిఐ శ్రీను

**నవతెలంగాణ-సిద్దిపేటరూరల్**

చదువుకునే సమయంలో విద్యార్థులు చెడు ఆలోచనలు రానివ్వద్దు అని సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా శుక్రవారం సిద్దిపేటరూరల్ మండల పరిధిలోని తోర్నాల గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు మహిళల రక్షణకు చట్టాలు. గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి మత్తు పదార్థాలు, ఈవిటీజింగ్ సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే జాతీయ సైబర్ సెల్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫోక్సో చట్టాలు బాల్య వివాహాలు టీజింగ్, సెల్ఫ్ డిఫెన్స్, ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100, లేదా సిద్దిపేట షీ టీమ్ నెంబర్ 8712667434 కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫయాజ్ అలీ, ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీమ్ బృందం కిషన్, ఏఎస్ఐ, కానిస్టేబుల్ మమత, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థి దశలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు

- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జడ్జి స్వాతి రెడ్డి

**నవతెలంగాణ-కొండపాక**

విద్యార్థి దశలో తొందరపాటు నిర్ణయాలు తీసుకొని జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జడ్జి స్వాతి రెడ్డి అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కుకునూర్ పల్లి మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మహిళకున్న చట్టాలపై అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నిత్యజీవితంలో చిన్న చిన్న సమస్యలు ఎదురుకాకుండా ఉండడానికి, ఒకవేళ సమస్యలువస్తే వాటిని అధిగమించడానికి చట్టాలు తొడ్పాడుతాయని సూచించారు. పోక్సో చట్టం, సమాచార హక్కు చట్టం, మోటారు వాహనాల చట్టం, బాలకార్మిక నిర్మూలన చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, జువైనెల్ జస్టిస్ యాక్ట్, ఉచిత న్యాయసేవా సహాయంపై విద్యార్థులకు తెలియజేసారు. మీ చుట్టు బాల్య వివాహ బాధితులు, బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్లు గుర్తిస్తే స్థానిక తహసీల్దార్ , పోలీస్ అధికారి, మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయం, ఫోన్ ద్వారా తెలుపవచ్చని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంలో సంప్రదిం చవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో తోగుట సీఐ షేక్ లతీఫ్, మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య, కుకునూర్ పల్లి ఎస్ఐపి శ్రీనివాస్ విద్యార్థులు తదితరులున్నారు.



## మాతా శిశు సంరక్షణ హాస్పిటల్‌ను అందుబాటులోకి తేవాలి



**నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్**

హుస్నాబాద్ పట్టణంలో రూ.7 కోట్ల నిధులతో నిర్మించిన మాత శిశు సంరక్షణ హాస్పిటల్ పూర్తిస్థాయిలో పూర్తయిందని వెంటనే హాస్పిటల్‌లో అందుబాటులోకి తేవాలని బీఎస్పీ పార్టీ ఇంచార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మాతా శిశు సంరక్షణ హాస్పిటల్ సందర్శించిన నాయకులు మాట్లాడుతూ.. హాస్పిటల్ పూర్తయి 8 నెలలు గడుస్తుందని కరెంటు, నీరు, ఫర్నిచర్ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినట్టు తెలుస్తుందన్నారు. హాస్పిటల్ ఓపెనింగ్ అయితే హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడిలోని ప్రజలకు వైద్య పరంగా గర్భిణీ స్త్రీలకు, చిన్నపిల్లల వైద్యానికి కరీంనగర్ వరంగల్ హైదరాబాద్‌కు వెళ్లకుండా బాధలు తప్పుతాయన్నారు. ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గుతాయని వెంటనే హాస్పిటల్ ను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, జిల్లా మాజీ అధ్యక్షులు దేగల వెంకటేష్, నియోజకవర్గ అధ్యక్షులు వెలుపుల రాజు పాల్గొన్నారు.


# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

## మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం | 08 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com


## పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

**-మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి**



**నవతెలంగాణ-దుబ్బాక**

ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు, నల్లా బిల్లులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి కోరారు. శుక్రవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని 13, 14, 18 వార్డులను ఆయన సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న నల్లా బిల్లులు, ఇంటి పన్నులు చెల్లించాలని, వ్యాపారస్తులు విధిగా ట్రేడ్ లైసెన్స్‌లను తీసుకోవాలన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రూ.2 కోట్ల టార్గెట్ ఉండగా ప్రస్తుతం రూ.1 కోటి 10 లక్షలు వసూలయ్యాయని, మరో రూ.90 లక్షల బకాయిల్ని త్వరలోనే వసూలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం 18వ వార్డులోని చిల్డ్రన్స్ పార్క్‌ను పరిశీలించి, పార్కును శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మేనేజర్ శ్రీనివాస్, వర్క్ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

## 11న వాహన వేలం

**-ఎస్సై అపూర్వ రెడ్డి**



**నవతెలంగాణ-సిద్దిపేటరూరల్**

సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ నెల 11న ఉదయం 11 గంటలకు ఎక్సైజ్ కేసులో స్వాధీనం చేసుకున్న హుండాయ్ క్రెటా కార్‌ను వేలం వేయనున్నట్లు రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం వేలం పాటలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు. ఎక్సైజ్ సీఐను లేదా రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఆ వాహనం అప్సెట్ ప్రైస్ రూ.4.50 లక్షలు అని తెలిపారు. వాహనాన్ని బిడ్ చేసిన వారు 18 శాతం జీఎస్టీ ఉంటుందన్నారు.

## పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

**-నీటి శీతలికరణ యంత్రం అందజేత**



**నవతెలంగాణ-బెజ్జంకి**

మండల పరిధిలోని చీలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 2008-09 పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. శుక్రవారం పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం సుమారు రూ.25 వేల విలువైన నీటి శీతలికరణ యంత్రం అందజేశారు. పూర్వ విద్యార్థులు పైడి నాగరాజు, ఎండీ అజారుద్దీన్, పంతం మనోజ్, బండిపెల్లి ప్రవీణ్, శ్రీరాముల హరీష్, కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శానగొండ శరత్, బీవీఎఫ్ నాయకుడు నిషాని సురేశ్,బోధన సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

## సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి



**నవతెలంగాణ-అక్కన్నపేట**

గిరిజనుల ఆరాధ్యుడు సద్గురు సంతు సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవ దినంగా ప్రకటించాలని గోరు సేన జిల్లా అధ్యక్షుడు గుగులోతు రాజు నాయక్ అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండల కేంద్రంలో గిరిజన నాయకుల ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మొత్తం 12 కోట్లకు పైగా గిరిజనులు ఉన్నారని, వారంతా సంతు సేవాలాల్ మహారాజుని పూజిస్తారని తెలియజేశారు. ఫిబ్రవరి 15న ఆయన జయంతి సందర్భంగా ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటించాలని కోరారు. అంతేకాకుండా ఆయన జయంతిని ఘనంగా నిర్వహించడం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుగులోతు అర్జున్ నాయక్, రాజు నాయక్, భూక్య శ్రీనివాస్, లావుడియా సురేష్ నాయక్, తదితరులు, పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి



**నవతెలంగాణ-గజ్వేల్**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు గజ్వేల్ పట్టణంలో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ అమ్మకాలు జరిపినట్లైతే మెటీరియల్ను వెంటనే సీల్ చేస్తామని అన్నారు. అంతేకాకుండా షాప్ యజమానిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఎక్కడ కూడా ప్లాస్టిక్ హోల్‌సేల్ నిర్వహించకూడదని పేర్కొన్నారు. అంతేకాకుండా నిబంధనలకు వెళుతున్న నడుపుతున్న దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తామని పైగా జరిమానా విధిస్తామని ఆయన పేర్కొన్నారు.

## అండగా ఉంటా అధైర్య పడొద్దు

**-వంగ రాజేశ్వర్ రెడ్డి**



**నవతెలంగాణ-నంగునూరు**

నంగునూరు మండలం పాలమాకుల గ్రామానికి చెందిన పిట్టల సత్యనారాయణ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. శుక్రవారం ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా ఉంటానని తెలిపారు. బాధలో ఉన్న కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. అదే గ్రామానికి చెందిన వాటర్ మ్యాన్ గా విధులు నిర్వహిస్తున్న గుండె యాదయ్య గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని కూడా పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఓజల్ యాదవ్, రాజేందర్, పండుగ మల్లేశం, సంపత్, నర్సింహులు, నరేశ్, రాజ్ కుమార్, కిషన్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

**-కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిష్టారెడ్డి**



**నవతెలంగాణ-రాయపోల్**

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్తుగారి కిష్టారెడ్డి అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలోని ప్రతి కాలనీలో సీసీ రోడ్డు దాదాపు రూ. 80 లక్షల నిర్మాణ పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయనకి తొమ్మిదవ వార్డు ప్రజలు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా కృష్టారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున రాయపోల్ అభివృద్ధికి సహకరించిన ఉమ్మడి మంత్రి కొండా సురేఖకు, చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు బాగన్నగారి రాజిరెడ్డి, మల్లారెడ్డి, ప్రవీణ్, ప్రశాంత్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అండర్ డ్రైనేజ్ సమస్యల పరిష్కారానికి కృషి



**నవతెలంగాణ-గజ్వేల్**


గజ్వేల్‌లో అండర్ డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని అండర్ డ్రైనేజీ సమస్య ఉన్న వార్డులో జట్టింగ్ మిషన్ ద్వారా అండర్ డ్రైనేజీని క్లియర్ చేస్తున్నామని ఆయన చెప్పారు. పారిశుద్ధ్యంలో భాగంగా మున్సిపల్ పరిధిలో అండర్ డ్రైనేజీ లో వ్యర్థ యదార్థాలు, శానిటరీ ప్యాడ్స్, షాంపూ ప్యాకెట్లు అండర్ డ్రైనే చాంబర్లో వేయకూడదని సూచించారు. మున్సిపల్ పరిధిలో పరిశుభ్రతకు సహకరించాలని ఆయన కోరారు. వర్షాకాలంలో మరింత సమస్య ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిపెటకొని అండర్ డ్రైనేజీ లో ఎలాంటి చెత్తను చదరాన్ని వేయవద్దని కోరారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



**నవతెలంగాణ-కొండపాక**

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కొండపాక మండలం దుద్దెడ శివారులో సేలంపు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన దొండకాయల కనకయ్య (50) అనే వ్యక్తి మృతదేహం చెట్ల పొదలలో పడి ఉంది. ప్రస్తుతం ఆయన సిద్దిపేట హనుమాన్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన మెడ చుట్టూ కమిలిన గాయం ఉంది. దీన్నిబట్టి ఎవరో చంపి తీసుకువచ్చి ఇక్కడ పడేసినట్టు భావిస్తున్నారు. భూతగాదాల కారణంగానే చంపేసి ఉంటారని భావిస్తున్నారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




# స్థానిక ఎన్నికల సమరానికి సై

> గజ్వేల్‌లో ప్రధాన పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవడానికి పావులు కదుపుతున్నాయి. దీంతో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నామని అంటున్న పార్టీలు. ముఖ్య నాయకుల సమావేశాలు, కార్యకర్తలు ప్రజలతో మమేకం అవుతుండటం, ఇలా వివిధ కార్యక్రమాలతో స్థానికంగా రాజకీయం వేడెక్కుతున్నది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మేము గెలుస్తామంటే..మేము గెలుస్తామంటూ..స్థానిక సమరానికి పార్టీలు 'సై' అంటున్నాయి.

**నవతెలంగాణ -గజ్వేల్**

స్థానిక సమరానికి స్థానిక నేతలు సై అంటూ ముందుకు వెళుతున్నారు. సిద్దిపేట జిల్లాలో ఎన్నికలకు అధికారులు సంసిద్ధమవుతున్నారు. మరో పక్క మూడు ప్రధాన పార్టీలు ఎన్నికలకు కాలు దువ్వుతున్నాయి. మరోసారి సిద్దిపేట జిల్లా లో ఉన్న గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల ప్రాంతాల్లో తిరిగి తన ఆధిపత్యం చాటుకోవాలని ప్రధాన ప్రతిపక్షం బీ ఆర్ ఎస్ ప్రయత్నాలు చేస్తుండగా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా సిద్దిపేట జిల్లాను టార్గెట్ చేసింది. ప్రస్తుతం పదవి కాలం ముగిసిన ప్రజాప్రతినిధుల్లో బీఆర్ఎస్ నాయకులే ఎక్కువగా ఉండటం వల్ల ఈ సారి తిరిగి అన్ని స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంది. బీజేపీ సైతం సిద్దిపేట జిల్లాలో ఒక బలమైన పార్టీగా నిలబడాలని ప్రయత్నం చేస్తుంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తన బలాన్ని చాటుకునేందుకు పావులు కదుపుతుంది. ఈ జిల్లాపై ఎంపీలు రఘునందన్ రావు, ఈటెల రాజేందర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎన్నికల షెడ్యూలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని మూడు ప్రధాన పార్టీలు తమ క్యాడర్‌కు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చి సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**సిద్దిపేట జిల్లాలో..**

సిద్దిపేట జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. దుబ్బాక, గజ్వేల్, సిద్దిపేట, చేర్యాల, హుస్నాబాద్ మున్సిపాలిటీలు ఈ జిల్లాలోనే ఉన్నాయి. 26 జడ్పీటీసీలు, 504 గ్రామపంచాయతీలు, ఎంపీపీ 26, ఎంపీటీసీ స్థానాలు 230 నుంచి వరకు పెంచినట్లు తెలుస్తుంది. ఈ నెలలోనే ఎన్నికల షెడ్యూలు రావచ్చని అధికారుల ద్వారా సమాచారం.




**గజ్వేల్ అసెంబ్లీపై మరోసారి పట్టు సాధించేందుకు..**

నియోజకవర్గంలో...గజ్వేల్ మండలంలో 25 గ్రామపంచాయతీల్లో,11 ఎంపీటీసీల్లో , జగదేపూర్ మండలంలో 23 గ్రామలు, 14 ఎంపీటీసీల్లో, ములుగు మండలంలో 26 గ్రామలు, 11 ఎంపీటీసీల్లో, వర్గల్ మండలంలో 27 గ్రామలు,11 ఎంపీటీసీల్లో, తూప్రాన్ మండలంలో 14 గ్రామలు, 7ఎంపీటీసీల్లో, మనోహరాబాద్ మండలంలో 17 గ్రామలు,7ఎంపీటీసీల్లో మర్కుక మండలంలో మొత్తం 16 గ్రామలు,7 ఎంపీటీసీల్లో, కొండపాక మండలంలో 25 గ్రామల్లో,12 ఎంపీటీసీల్లో, అన్నింట్లో బీఆర్ఎస్‌దే పైచేయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ ప్రభావం ఎంతవరకు ఉంటుందో అని ఆ పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు. నియోజకవర్గంలో పై పట్టున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి 9 మండలాల్లో కాంగ్రెస్ జెండాలు ఎగరాలని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అధిష్టానం ఎలాంటి సిగ్నల్ ఇస్తుందో వేచి చూడవలసి ఉంది.




## సత్యసాయి సేవలు విశ్వవ్యాప్తం కావాలి

- మానవత్వం సాయితత్వం
- పసి హృదయంలో సంజీవని
- ప్రముఖ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్



**నవతెలంగాణ-కొండపాక**

సత్యసాయి సేవా సంస్థలు అందిస్తున్న ఉచిత సేవలు విశ్వవ్యాప్తం కావాలని ప్రముఖ క్రికెటర్ పద్మశ్రీ వీవీఎస్ లక్ష్మణ్ అన్నారు. కొండపాకలోని సత్యసా యి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ రీసర్చ్‌ను శుక్రవారం సాయం త్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆపరేషన్లు పూర్తి చేసుకున్న పిల్లలకు సర్టిఫికెట్లు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవత్వం సాయి తత్వం అని సిద్దిపేట రూరల్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న డాక్టర్లను అభినందించారు. సిద్దిపేట ఆసుపత్రి సేవలు విశ్వవ్యాప్తం కావాలని ఆయన ఆకాంక్షిం చారు. ప్రతి ఒక్కరూ సేవా తత్వాన్ని అలవర్చుకోవాలని సేవలోనే సంతృప్తి ఉంటుందన్నారు. చిన్నపిల్లల ఆపరేషన్లు ఎంతో క్రిటికల్‌తో కూడుకున్నవని ఇక్కడ వారు ఇస్తున్న సేవలు ఎంతో గొప్పవారు ప్రేమ సేవ అందిస్తూ పిల్లలను అక్కున చేర్చుకుంటున్నారని ప్రశంసిం చారు. ఆస్పత్రి చైర్మెన్ శ్రీనివాస్ మాట్లాడు తూ మనమంతా నిమిత్త మాత్రులం సాక్షాత్తు ఆ దేవుడే మాతో ఈ పని చేపిస్తున్నాడు అని పేర్కొన్నారు. పసి హృదయాలను కాపాడుతూ భవిష్యత్తు తరాలను అందించే సంకల్పంతో ముందుకు వెళుతున్నామన్నారు. సేవ ఆరోగ్యం ప్రగతికి బాటలు లాంటివి అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాగిణి స్వర్ణ ఎన్‌టీపీపీ ప్రతినిధి పాణిగ్రాహి ఇన్ఫోసిస్ ప్రతినిధి వంశీ కృష్ణ జగన్నాధ శర్మ తదితరులు పాల్గొన్నారు

**-కలకత్తా మ్యాచ్ మర్చిపోలేనిది**

క్రికెట్ లైఫ్‌లో కలకత్తా మ్యాచ్ తనకు మరుపు రానిదని క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ తెలిపారు. ఆసుపత్రి సిబ్బందితో మాట కొద్దిసేపు మాట్లాడారు. తన కుటుంబం వైద్య వృత్తిపరమైనది కానీ తాను కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో క్రికెట్ పై ఆసక్తి పెంచుకొని 134 టెస్ట్ మ్యాచులు ఆడి ఎంతో మంది అభిమానం చూడమన్నానన్నారు తనకు సచిన్ అల్టిమేట్ టెండూల్కర్ రోల్ మోడల్ అని అన్నారు. వృత్తి ధర్మాన్ని బాధ్యతగా నిర్వర్తించిన వారే సెలబ్రేట్ అవుతారని పేర్కొన్నాడు.

## రైతులు పంట వివరాలను నమోదు చేసుకోవాలి

- ఏఈఓ సంతోష్ కుమార్



**నవతెలంగాణ-దౌల్తాబాద్**

రైతులు తాము పండించిన పంట వివరాలను తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని దొమ్మాట ఏఈఓ సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలో లింగరాజు పల్లి గ్రామంలో రైతుల పంట వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసా, పండించిన పంటలకు మద్దతు ధర, సన్న రకం వరి ధాన్యానికి బోనస్ లాంటి పథకాలు రైతులు అందించడానికి ప్రభుత్వం పంట వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని రైతులంద రూ తప్పనిసరిగా వారు పండించే పంటల వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లింగరాజు పల్లి రైతులు లింగం, దయాకర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఊర్లను ముంచి లేఖల పేరుతో డ్రామాలు

- కాంగ్రెస్ మండలాధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్



**నవతెలంగాణ-సిద్దిపేట**

గత ప్రభుత్వంలో 10 ఏండ్లు మంత్రిగా ఉండి చెల్కలపల్లి గ్రామంతో పాటు నియోజకవర్గంలో పలు గ్రామాలను నట్టేట ముంచి ప్రజల ఉసురుపోసుకున్నది నువ్వే కాదా అని, ఊర్లను ముంచి లేఖల పేరుతో డ్రామాలు ఆడుతున్నామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పై కాంగ్రెస్ మండల అధ్యక్షులు మీసం మహేందర్ మండిపడ్డారు. చిన్నకోడూరు మండల పరిధిలోని అన్నపూర్ణ ప్రాజెక్టు లో ముంపునకు గురవుతున్న చెల్కలపల్లి గ్రామన్ని కాంగ్రెస్ నాయకుల తో కలిసి సందర్శించి, ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నపూర్ణ ప్రాజెక్ట్ నిర్మాణంలో ముంపునకు గురైన చెల్కలపల్లి, కాసారంపల్లి, ఎల్లయ్య పల్లి గ్రామాలకు సరైన నష్టపరిహారం ఇవ్వకుండా, మోసం చేసిన ఘనత హరీశ్ రావుకే దక్కుతుందని అన్నారు. ఈ సమస్యను మంత్రుల దృష్టికి తీసుకపోయి గ్రామాల ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు పర్శరాం యాదవ్, భూపతిరెడ్డి, ఉడుత జయంత్, ప్రశాంత్, వినోద్, వెంకటరెడ్డి, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు అన్యాయం చేసే దిశగా సర్కార్ కుట్ర



**నవతెలంగాణ-మిరుదొడ్డి**

బీసీలను పూర్తిగా అణగదొక్కే కుట్ర జరుగుతోందని, బీసీ రిజర్వేషన్ పూర్తిగా గందరగోళం చేసే దిశగా ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సిద్దిపేట జిల్లా బీసీ సంఘం నాయకులు కంచం యాదగిరి మడ్డిపడ్డారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తప్పుల తడుకగా కులగణన సర్వే నివేదిక ఉందని రాజకీయ విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు అన్యాయం చేసే దిశగా తెలంగాణా కాంగ్రెస్ సర్కార్ కుట్రలు పన్నుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ జనాభా 1 కోటి 85లక్షల 61వేల 856వందల మంది ఉండగా నేటి రేవంత్ రెడ్డి సర్కారు చేపట్టిన కులగణన సర్వేలో 1 కోటి 64 లక్షల 9 వేల 179మంది తగ్గించి చూపించడం హాస్యాస్పదంగా ఉందన్నా రు. రెవంత్ రెడ్డి సర్కారు సర్వేరికార్డులో మాత్రమే ఎస్సీబిసి జనాభా నియంత్రించే విధంగా అడుగులు వేస్తుందన్నారు. ఈడ భ్యూఎస్ ప్రకారం10 శాతం కాపాడుకునే కుట్రలో భాగంగా సర్వే రిపోర్టును బయటపెట్టారని పేర్కొన్నారు. బీసీలకు న్యాయం జరిగేవరకు కాంగ్రెస్‌పై పోరాటానికి సిద్ధం కావాలని కోరారు

## ఎమ్మెల్సీగా అశోక్ కుమార్‌ను గెలిపించండి



**నవతెలంగాణ-గజ్వేల్**

ఎమ్మెల్సీ అభ్యర్థిగా అశోక్ కుమార్‌లు గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ కోరారు. శుక్రవారం సాయంత్రం గజ్వేల్ పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ టీపీటీఎఫ్ అభ్యర్థి వై అశోక్ కుమార్ తెలంగాణ ఉద్యమంలో, ఉపాధ్యాయ ఉద్యమంలో అట్లాగే ప్రభుత్వ పాఠశాలల ప్రభుత్వ విద్య పట్ల అవగాహన ఉన్నటువంటి నాయకుడు అన్నారు. ఈ సమాజానికి ప్రభుత్వ పాఠశాలకు ప్రభుత్వ విద్యారంగానికి ఎంతో కృషి జరుగుతుందన్నారు. మిగతా అభ్యర్థులతో పోల్చుకు న్నట్లయితే రియాల్టర్లు కార్పొరేట్లను పెద్దల సభకు పంపిస్తే విద్యా రంగానికి ఎలాంటి ప్రయోజనం జరగకుండా నష్టం జరుగుతుందన్నారు. ఆర్థిక బలం లేనందున ఉపాధ్యాయులు శ్రేయోభిలాషి నుంచి విరాళాలు సేకరించుటకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నరేందర్, జోన్ కన్వీనర్ జల్లెల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పాపి రెడ్డి, జోన్ పరిధిలోని మండలాల అధ్యక్షులు నాగరాజు, సత్తయ్య, గోవర్ధన్ రెడ్డి, పర్వతం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## కురుమ సంఘం భవన నిర్మాణానికి ఆర్థిక సాయం



**నవతెలంగాణ-మద్దూరు**

చేర్యాల మండలంలోని కమలాయపల్లి, గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కురుమ భవనానికి యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు కమలాకర్ యాదవ్, జాలపల్లి, కమలాయపల్లి, అర్జున పట్ల, గ్రామాల మాజీ ఎంపీటీసీ చేట్యూరి కళ్యాణి దంపతులు. తమ సొంత ఖర్చులతో 50 సిమెంట్ బస్తాలు శుక్రవారం వారు అందజేశారు. ఈ సందర్భంగా కురుమ కులస్తులు మాట్లాడుతూ గతంలో కురుమ భవనంలో బోరు లేదని కమలాకర్ యాదవ్, దృష్టికి తీసుకు వెళ్లడంతో రూ.60 వేలతో బోరు వేయించారని తెలిపారు. కురుమ సంఘం భవనానికి అండగా ఉంటున్న కమలాకర్ యాదవ్, దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు . కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు కొల్పుల యాదగిరి, బైతి శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, రాములు, ఎంటే బాపిరాజు , కుర్మా సంఘం సభ్యులు పాల్గొన్నారు

## విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

**నవతెలంగాణ-మర్కుక్**

ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే అన్ని రంగాల్లో రాణిస్తారని జైన్ వేర్ సంస్థ చైర్మెన్ కల్లెపు నవీన్ రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు ,పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు గౌడ్, ఎస్ఎంసి చైర్మెన్ బాల్ రెడ్డి, వైస్ చైర్మెన్ కనకయ్య ఉపాధ్యాయులు హారిక సంతోషిమాత, చిన్నికృష్ణ, ,విద్యార్థులు తదితరులున్నారు.



## ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తా

- కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి కొమరయ్య



**నవతెలంగాణ-సిద్దిపేట**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి కృషి చేస్తానని, ఉపాధ్యాయుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్కా కొమరయ్య అన్నారు. పట్టణంలోని మున్నూరు కాపు సంఘంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉపాధ్యాయుల సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న వివిధ రకాల ప్రభుత్వ పాఠశాలలో పాఠశాలను బట్టి సమస్యలు ఉన్నాయని, నూతన పెన్షన్ విధానం తీసుకొచ్చి ఉపాధ్యాయులకు అన్యాయం చేశారని, సమస్యలను పరిష్కరించే మంచి అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. బీజేపీ, తపస్ బలపరిచిన అభ్యర్థి అయినా తనను గెలిపించాలని, బిసి ఉపాధ్యాయ సంఘాలు, మోడల్ స్కూల్స్ సంఘం తనకు పూర్తి మద్దతు తెలపడం సంతోషంగా ఉందన్నారు. పట్టభద్రుల బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి సతీమణి గోదావరి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ బలపరిచిన మూడు ఎమ్మెల్సీల అభ్యర్థులు గెలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు, ప్రతినిధులు శ్రీనాకర్ రెడ్డి, ప్రభాకర్, తిరుపతి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.